సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 154
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | మంగళవారం 09 జూన్ 2026
Published from Hyderabad, Vijayawada.

## నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పేపర్ తయారీ నుంచి, ప్రింటింగ్ వరకు రహస్యం
పేపర్ తయారీదారులంతా రహస్య ప్రదేశానికి తరలింపు

న్యూఢిల్లీ,జూన్8(సాక్ష్యం): మే 3న జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించబోయే రీ టెస్ట్‌ను అత్యంత పారదర్శకంగా, లీకులకు ఏమాత్రం తావులేకుండా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ భద్రతా వ్యూహాన్ని సిద్ధం చేశాయి. ఈసారి క్వశ్చన్ పేపర్లు లీక్ అవ్వకుండా ఉండేందుకు ఏకంగా భారత వైమానిక దళం మిగతా 5 లో..






## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు

- ఇది మోసపూరితమని చెప్పలేం
- పరస్పర అంగీకారంగా గుర్తించాల్సిందే
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూన్8(సాక్ష్యం): పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మిగతా 2 లో..



## యూరియా యాప్‌తో రైతులకు మేలు

- అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆసక్తి
- ప్రశంసలు అందించిన కేంద్ర వ్యవసాయ శాఖ
- మంత్రి తుమ్మల కార్యాలయం ప్రకటన

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ మిగతా 2 లో..



## తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి

- జోగులాంబ గద్వాల జిల్లాను తాకినట్లు వెల్లడి

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): తెలంగాణ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు రాష్ట్రాన్ని తాకాయి. తాజాగా వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. రుతుపవనాలు జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా తెలంగాణలోకి అధికారికంగా ప్రవేశించాయి. మిగతా 2 లో..

# బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుదాం


- కలిసికట్టుగా ఉంటేనే నిలబడతాం
- కూటమి పార్టీలకు రాహుల్ పిలుపు
- ప్రధాని నరేంద్ర మోడీ పాలనతో చిక్కుల్లో దేశం
- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

న్యూఢిల్లీ,జూన్8 : కలిసికట్టుగా ఉంటేనే నిలబడతామని, విడిపోతే పడిపోతామని లోక్‌సభలో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ విషయాన్ని భాగస్వామ్య పార్టీలు గుర్తెరిగి, ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీజేపీ నుంచి ఎదురయ్యే సవాళ్లను కలిసికట్టుగా ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూట్ క్లబ్‌లో సోమవారంనాడు జరిగిన 'ఇండియా' కూటమి సమావేశంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. కూటమి పార్టీలు ఒకరిపై మరొకరు పైచేయి సాధించాలని అనుకోకుండా కలిసి కట్టుగా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని, బీజేపీ నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. 'ఓటు చోరీ' వంటి పలు అంశాల విషయంలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం లోపించడం, కూటమిలో మిగతా 5 లో..




## హర్మూజ్ వద్ద భారత ప్రయాణికుల నౌకపై దాడి

- దాడి కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఇంజన్
- ఉద్రిక్తతల వేళ హోర్ముజ్ జలసంధి మూసివేత
- సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- దేశంలో 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ



న్యూఢిల్లీ,జూన్8(సాక్ష్యం): పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ, భారతీయులు ప్రయాణిస్తున్న ఓ కార్గో నౌక దాడికి గురైనట్టు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఈ దాడి జరగ్గా.. ఆ సమయంలో నౌకలో 24 మంది భారతీయులున్నారని సమాచారం. దీంతో అత్యవసర సహాయం కోసం నౌకలోని సిబ్బంది అభ్యర్థించినట్టు వార్తలు వస్తున్నాయి. పలావు దేశ జెండాతో వెళ్తున్న నౌక ఒమన్ మిగతా 5 లో..



# ఇంకెన్నాళ్లు గుజరాత్‌కు గులాంగిరి

## రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..

### మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అడ్డుకుంటున్నారు

"తెలంగాణలో 8 మంది బీజేపీ ఎంపీలు గెలిస్తేనే మోదీ ప్రధానమంత్రి అయ్యారు. తెలంగాణ ప్రయోజనాలపై మీరు మోదీని అడగరా? మూసీనది ప్రక్షాళన కోసం అనుమతులు తీసుకురమ్మంటే అది చేతకాదు. కిషన్‌రెడ్డి ప్రధానమంత్రి మోదీని అడగాలి. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో తుమ్మిడిహెట్టి నిర్మాణం చేయాలంటే మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చిద్దామంటే అడ్డుపడుతున్నది మీరు కాదా? ఎందుకు అడ్డుకుంటున్నారు"
-రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

- హైదరాబాద్‌లో పేద ప్రజలకు ఇస్తాం
- నివాస అనుకూల నగరం హైదరాబాద్
- దేశంలోని కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు
- పాలనా సమన్వయం కోసమే కార్పొరేషన్లు
- బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఏం తెచ్చారు
- మోడీని నేను ఒప్పిస్తే ఆయన ఆపుతున్నారు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలపై మండిపడ్డ సీఎం రేవంత్

హైదరాబాద్,జూన్8 : రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ.. గుజరాత్‌కు ఇంకెన్నాళలు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని మిగతా 2 లో..

# బొగ్గు దిగుమతులను తగ్గించేయత్నం

- బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్
- మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- గత 12 ఏళ్లుగా ప్రధాని మోడీ నిరంతర కృషితో పురోగతి
- కోల్ రంగంలో సంస్కరణలతో ఐదులక్షల మందికి ఉపాధి
- క్రిటికల్ మినరల్స్ కోసం అర్జెంటీనాతో ఒప్పందం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): క్రమంగా విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను తగ్గించే పనిలో ఉన్నామని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో రూ. 1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు మిగతా 2 లో..

## మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు
సీఎం రేవంత్ సమక్షంలో నేడు అందచేత

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు కేటాయించనుంది. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మిగతా 5 లో..

## విశాఖ స్టీల్‌లో భారీ ప్రమాదం

ద్రవరూప స్టీల్ లిక్విడ్ పడి మంటలు
9మంది కార్మికుల దుర్మరణం
ఏడుగురికి తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు
మంటలు చెలరేగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం
ఘటన జరిగిన వెంటనే కార్మికులు, ఉద్యోగుల పరుగు
ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి.. అధికారులతో ఆరా



విశాఖపట్నం,జూన్8(సాక్ష్యం): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. మిగతా 2 లో..

# సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం
- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు కోచింగ్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ మిగతా 5 లో..



## రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం

డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): తెలంగాణ రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. హౌసింగ్ బోర్డు భూముల పరిశీలన సమయంలో రాము నాయిక్ చేసిన భారీ అక్రమాలు బయటపడ్డాయి. బహిరంగ మిగతా 5 లో..

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి
మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి
మహిళలకు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపు



హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం మిగతా 5 లో..

# సంపాదకీయం

## విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా!

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళు తున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘానిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

## విశాఖ స్టీల్‌లో భారీ ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

ఈ ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిపమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మెటల్ ల్యాడల్ నుంచి బకెట్లు కుప్పకూలాయి. ల్యాడల్‌లో ఉన్న ద్రవ లోహం అకస్మాత్తుగా కిందపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ప్రమాదస్థలిలో 9 మంది కార్మికులు మృతిచెందగా, మరో ఏడుగురికి



గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ యాజమాన్యం అత్యవసర భద్రతా చర్యలు చేపట్టింది. గాయపడిన కార్మికులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ప్లాంట్‌లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ల్యాడల్‌లోని ద్రవ లోహం ఎందుకు కిందపడింది?, సాంకేతిక లోపమా? లేక భద్రతా ప్రమాణాల్లో ఏవైనా నిర్లక్ష్యం జరిగిందా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అధికారిక నివేదిక వచ్చిన తర్వాతే గాయపడిన వారి సంఖ్య, మరణాల వివరాలు, ప్రమాదానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కార్మికుల మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా విచారించాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఈ ప్రమాదంపై వెంటనే స్పందించారు. విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం పర్యటనలో ఉన్నప్పటికీ, ప్రమాద సమాచారం అందిన వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి హోంమంత్రి బయలుదేరారు.

# ఇంకెన్నాళ్ళు గుజరాత్‌కు గులాంగిరి



మొదటిపేజీ తరువాయి..

తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన



సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు.

పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు. రూ.229 కోట్లతో ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు కోసం ప్రధాన వంతెన నిర్మాణం, ఓఆర్ఆర్ నుంచి కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ.110కోట్లతో శంకర్‌పల్లి రోడ్ నుంచి మణికొండ వరకు పైప్ లైన్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. రూ.29.25కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలోని రెండు రైల్వే ఓవర్ హెడ్స్ వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. రూ.26.50కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ఉన్న ప్రధాన క్యారేజ్ వే విస్తరణకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికీ భూమిపూజ చేశారు. రూ.14.40కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం మియాపూర్‌లో 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సభకు మంత్రి శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాల్ రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# బొగ్గు దిగుమతులను తగ్గించేయత్నం



మొదటిపేజీ తరువాయి..

రద్దు చేసింది. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం అన్నారు. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొనేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదులక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కోల్ రంగం పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు. ప్రపంచంలో బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి వివరించారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం దేశ అవసరాలకు సరిపడేలా 80 రోజుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా కోల్ సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. స్టీల్, ఎరువుల పరిశ్రమలతో పాటు అనేక రంగాలకు బొగ్గు కీలక ముడి పదార్థమని పేర్కొన్న కిషన్ రెడ్డి, గతంలో విదేశాల నుంచి భారీగా బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశీయ ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. మైనింగ్ ప్రాంతాల్లో రైల్వే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ రవాణా ఖర్చులు తగ్గించే చర్యలు చేపడుతు న్నామని చెప్పారు. క్రిటికల్ మినరల్స్ విషయంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, వాటి కోసం దేశాధినేతలను కూడా కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌కు ఒక పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో కూడా కీలక ఖనిజాల సరఫరాపై వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని చెప్పారు. కోల్ ఆధారంగా సింథటిక్ గ్యాస్ తయారీపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయంగా ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల వంటి పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి అవసరమని అన్నారు. దేశంలో 187 బొగ్గు గనులు ఉన్నాయని, వినియోగం పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తున్నామని మంత్రి తెలిపారు.

మూసివేసిన గనుల్లో పెద్ద ఎత్తున వృక్షారోపణ, పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ గనులను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, గిన్నిస్ బుక్ రికార్డుకు కూడా ప్రయత్నిస్తు న్నామని వెల్లడించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గనుల ప్రభావిత గ్రామాల అభివృద్ధికి 2శాతం నిధులు కేటాయించాలని చట్టం చేసినప్పటికీ, ఆ నిధులను జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్లను అడిగితే కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే సమాధానం వస్తోందని చెప్పారు. సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని పేర్కొన్న ఆయన, గతంలో డీఎంఎఫ్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. సింగరేణి ఆర్థిక భారం తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని, ఉద్యోగుల కోసం బీమా సదుపాయాలు కూడా తీసుకొచ్చామని తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గత 12 ఏళ్లలో మోదీ తన పాలనలో ప్రత్యేకమైన ముద్ర వేసారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ అభివృద్ధితో పాటు సామాజిక సంక్షేమానికి కూడా కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. అవినీతికి కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఆరోపించారు.

# రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టం

### అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం వెల్లడి

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో



మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే పన్నులు చెల్లించని వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే వాహనాల సీజ్‌కు ఆదేశాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల పన్నులు ఎగ్గొట్టే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై చెక్ పెడతామన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్,డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌తో రైతులకు మేలు

మొదటిపేజీ తరువాయి..

యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ నమూనాపై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు



ఇతర రాష్ట్రాలు చర్యలు చేపట్టాయని ఆయన వివరించారు. తెలంగాణ ఫర్టిలైజర్ యాప్.. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఈ÷ూం÷ూ ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ÷ూం÷ూ యాప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఫ్ల÷తుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూ లైన్‌లకు చెక్ పెడుతూ.. రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. నౌకాశ్రయాల్లోని పోర్టుల నుంచి యూరియా వేగంగా తరలింపునకు ప్రత్యేక అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాజకీయాలు చేయవద్దంటూ ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హితవు పలికారు. రైతులకు మెరుగైన సేవల కోసం సాంకేతిక వినియోగాన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యాలయం ప్రెస్ నోట్ విడుదల చేసింది.

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు

మొదటిపేజీ తరువాయి..

పెళ్లికి ముందు పరస్పర అంగీకారంతో ఏర్పడిన శారీరక సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి వ్యక్తిత్వం లేదా నడవడికను ప్రశ్నించలేమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రేమ సంబంధాలు అన్నీ వివాహానికి దారితీయవని తెలిపింది. ఇద్దరి మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడిన ప్రేమ బంధం తర్వాత వివాహంగా మారకపోయినా, దానిని మోసం లేదా నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అలాగే, ప్రేమలో ఉన్న సమయంలో వివాహం చేసుకుంటామని భావించి శారీరక సంబంధం ఏర్పడినప్పటికీ, తర్వాత వివిధ కారణాల వల్ల పెళ్లి జరగకపోతే ప్రతి సందర్భంలోనూ అది మోసం చేసినట్లుగా భావించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి

మొదటిపేజీ తరువాయి..

దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వాతావరణం చల్లబడటమే కాకుండా, రాబోయే రెండు మూడు రోజుల్లో ఇవి మరింత బలోపేతం కానున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ అంతటా రుతుపవనాలు పూర్తిగా విస్తరిస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రుతుపవనాల రాకతో ముఖ్యంగా దక్షిణ , తూర్పు తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ భారీ వర్ష సూచన జారీ చేసింది. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు, అలాగే సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఈ రుతుపవనాల ప్రవేశం ఎంతో ఉపశమనాన్ని , సంతోషాన్ని కలిగిస్తోంది.



సాక్ష్యం



## పశు సంపదతో గ్రామాల్లో సుస్థిర సంపద

అన్నదాతలకు అదనపు ఆదాయానికి వీలు

పాడి పశువుల్లో పునరుత్పత్తిపై ప్రత్యేక దృష్టి

పశువుల ఉత్పాదకత పెంపునకు కార్యాచరణ

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,జూన్8 : గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధికి పశుసంపద కీలకమని, పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్థిరమైన పాల ఉత్పత్తి ద్వారా రైతుల ఆదాయాన్ని సుస్థిరం చేసేందుకు పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ విధానంపై దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి విలేజ్ హెర్డ్ ఫెర్టిలిటీ రిజిస్టర్ (వీహెచ్ఎఫ్ఆర్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువుల్లో సకాలంలో చూలు కట్టించకపోవడం వల్ల రైతులు గణనీయంగా నష్టపోతున్నారని.. అందువల్ల ప్రతి పాడి పశువును దాని పునరుత్పత్తి, ఉత్పత్తి జీవిత చక్రాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ సకాలంలో చూలు కట్టించడం, క్రమబద్ధమైన ఈతలు, అధిక పాల ఉత్పత్తి, మెరుగైన పశు ఉత్పాదకతను సాధించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సకాలంలో ఈనే పశువుల వల్ల అధిక పాల దిగుబడి ఉంటుందని.. సకాలంలో చూలు కట్టించడం వల్ల అనుత్పాదక దినాలు తగ్గి రైతులకు అధిక ఆర్థిక లాభం కలుగుతుందన్నారు. అదేవిధంగా లింగ నిర్ధారిత వీర్యం వినియోగం వల్ల ఎక్కువ ఆడ దూడలు పుట్టి పాల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. కృత్రిమ గర్భధారణ, గర్భ నిర్ధారణ, వంధ్యత్వ నివారణ, పోషకాహార నిర్వహణ, దూడల సంరక్షణ వంటి శాస్త్రీయ పునరుత్పత్తి నిర్వహణ చర్యలు పశువుల ఉత్పాదకత పెంపులో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో పశు కేంద్రీకృత పునరుత్పత్తి నిర్వహణ కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందని.. దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎం.హనుమంతరావు, ఉపసంచాలకులు డా. కె.చంద్రశేఖర రావు, డా. మోజెస్ వెస్లీ, డా. ఎస్.నాగభూషణరావు, ఏడీ డా. సునంద, పశు వైద్యులు డా. మనోజ్, డా. పంకజ్, డా. చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు

## 10న ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎం, డిప్యూటీ ల భేటీ

నేడు ఢిల్లీకి వెళ్లనున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్8 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జూన్ 10వ తేదీన నిర్వహించనున్న ఎన్డీఏ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో వీరు పాల్గొన నున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరుకానుండగా, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాలతో సమన్వయం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. దేవిధంగా, త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాత్ర, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చలు జరగవచ్చని సమాచారం. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక అంశాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్‌లో ఉన్న విభజన హామీలపై సీఎం చంద్రబాబు కేంద్ర నాయకత్వంతో చర్చించే అవకాశం ఉంది.

## నామినేషన్లు వేసిన టిడిపి రాజ్యసభ అభ్యర్థులు

సానా సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ నామినేషన్లు

అమరావతి,జూన్8 : టీడీపీ రాజ్యసభ అభ్యర్థులుగా సానా సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం ఉదయం ఏపీ అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10:50 గంటల నుంచి 11:50 గంటల వరకు నామినేషన్ కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణికి ముగ్గురు టీడీపీ అభ్యర్థులు.. రెండు సెట్‌ల చెప్పున నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రులు కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హాజరయ్యారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భారీగా తరలివచ్చారు. జనసేన ఎమ్మెల్యేలు, బీజేపీ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కూటమి ఐక్యతకు ప్రతీకగా రాజ్యసభ నామినేషన్ కార్యక్రమం జరిగింది. వంగవీటి రాధాకృష్ణ సహా పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. టీడీపీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమం అసెంబ్లీలో సందడిగా సాగింది. అంతకుముందు ఉదయం వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సాన సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వెంకటపాలెం టీటీడీ దేవస్థానం పండితులు సాదర స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఏపీ అసెంబ్లీ వరకు టీడీపీ అభ్యర్థులు సైకిళ్లపై వెళ్లి.. ఆపై నామినేషన్ దాఖలు చేశారు.

## సిగరెట్‌లా ..సమాజానికి వైసిపి తీవ్ర హానికరం

ఈ విషయాన్ని కూటమి నేతలు రోజూ చెప్పాల్సిందే

నంద్యాల పర్యటనలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

నంద్యాల,జూన్8 : సిగరెట్ తాగడం ఎంత హానికరమో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరమని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రతిరోజూ కూటమి నేతలు ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రత్యర్థి ప్రజాస్వామ్యవాది కాదని.. అధికారం కోసం ఎన్ని అడ్డదార్లయినా తొక్కేందుకు సిద్ధపడతారని ఎద్దేవా చేశారు. సోమవారం నంద్యాల జిల్లాలో మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ లైన్ దాటి అధికారాన్ని ఉపయోగించరని, కానీ జగన్ రెడ్డి రోజూ లైన్ దాటుతారని చెప్పారు. ఏపీలో జగన్ అరాచక పాలన మళ్లీ రాకూడదంటే.. 'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, కూటమి అగైన్ అండ్ అగైన్' అని చాటి చెప్పాలని మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన 93శాతం స్ట్రైక్ రేటుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని వ్యాఖ్యానించారు. నాడు పోలింగ్ బూత్ స్థాయిలో వెనకడుగు వేయకుండా జెండా పట్టుకుని నిలబడిన ప్రతి కార్యకర్త శ్రమ, ధైర్యమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగాలను మరిచిపోతే ఏ రాజకీయ నాయకుడు, ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాగించలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలవబోయే నాయకులందరి కోసం తాము కష్టపడాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గ్రూపు రాజకీయాలు కడితే పతనం తప్పదని మంత్రి పయ్యావుల హెచ్చరించారు. కార్యకర్తలు, నేతలు అలకలు వీడాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అలిగి పార్టీకి దూరమవ్వద్దని చెప్పారు. కొట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రాయలసీమ రాజకీయాల్లో అప్రమత్తత అవసరమని తెలిపారు. గొడ్డలి పార్టీపై నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మనం ప్రభుత్వంలో ఉన్నామని నిద్రపోవద్దని చెప్పారు. టీడీపీ శ్రేణులు ఓటర్ లిస్ట్‌పై పట్టు సాధించాలని దిశానిర్దేశర చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.



# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

**భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీ**

**క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ**

**ట్యాంపర్ చేయకుండా పకడ్బందీగా భూ రికార్డులు**

**గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారు**

**గొడ్డలి పట్టే వారికి నాగలి పట్టే వారి బాధలు ఎలా తెలుస్తాయి**

**ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నాం**

**సిద్ధాంతంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ**

**సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్న చంద్రబాబు**

భీమవరం,జూన్8 : ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని అన్నారు. సోమవారం సిద్ధాంతంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తాగు నీరు, సాగునీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి రామానాయుడికి అప్పగించామన్నారు. ఎప్పుడు చూసినా గోదావరి జిల్లా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పంటలు పండించడంలో జిల్లాలో రైతులకు మించిన వారు లేరని కొనియాడారు. రాయలసీమ, విశాఖ జిల్లాల్లో పరిశ్రమల కోసం భూములు కావాలంటే ఇస్తారని.. ఇక్కడ మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వరని అన్నారు. అక్వా రైతుల సంక్షేమం కోసం ఓ ప్రణాళిక రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారని.. గొడవలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. గొడ్డలి పట్టుకునే వారికి నాగలి పట్టుకున్న రైతు గుర్తుకు రాలేదని వ్యాఖ్యానించారు. 'మీ భూమి మీద సైకో ఫొటో వేశారు. భూమి మీది.. ఫొటో సైకోది.. నిద్ర లేస్తూనే ఆయన మొహం చూడాల్సి వచ్చేది. జగన్ పిచ్చితనానికి ట్రీట్‌మెంట్ ఎక్కడ ఉందో తెలీదు. మీకేమైనా తెలిస్తే, ఆ అడ్రస్ ఆయనకు పంపుతాను' అంటూ సీఎం చంద్రబాబు సెటైరికల్ కామెంట్స్ చేశారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేశామని చెప్పారు. 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూ రికార్డులు అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26 లక్షల పాస్ పుస్తకాలను బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌లు, అధునాతన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాము. కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ప్రమాణాల తరహాలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు అందిస్తున్నాము. రీ-సర్వే, ఈ-కేవైసీ ప్రక్రియల అనంతరం మాత్రమే పాస్ పుస్తకాలు ముద్రిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసాము. ఇంకా 62.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా 90 లక్షల మంది భూ యజమానులకు పాస్ పుస్తకాలు అందజేయడమే లక్ష్యం. గత పాలనలో ఏర్పడిన సమస్యలను నుంచి తొలగించామని, 15 జిల్లాల్లోని 33,012 ఎకరాల షరతు గల పట్టా భూములపై ఆంక్షలను కూడా ఎత్తివేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోందని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ చేశామని, కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిపి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు రావడానికి నెలల తరబడి పట్టేదని, ప్రస్తుతం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు, చెరువుల మరమ్మతులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆక్వా చెరువులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, దాణా ధరలు పెరగడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఆక్వా రంగం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలకు కీలకమని పేర్కొన్న సీఎం, ఆ రంగానికి అన్ని విధాలా మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వినియోగించి న్యూట్రాస్యూటికల్ ఔషధాల తయారీకి అవకాశాలు ఉన్నాయని కూడా సూచించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.




పంపిణీ చేశామన్నారు. నిషేధిత జాబితా 22ఎలో ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రూ.8వేల కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని చంద్రబాబు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ఆక్వా రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల సంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జిల్లాలు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా నిలిచాయని కొనియాడిన సీఎం.. ఈ ప్రాంత రైతులు భూమిని సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని, భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం సీఎం చెప్పుకొచ్చారు. భూమి రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల పాటు కృషి చేయాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నాము. రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేసాం. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ వ్యవస్థను అమలు చేస్తున్నాము. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ రూ.10 లక్షల లోపు ఆస్తులకు కేవలం రూ.100తో బదిలీ సౌకర్యం కల్పించాము. అంతకంటే ఎక్కువ విలువ గల ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది' అని సీఎం చెప్పారు. అలాగే పాత భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని.. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ జాబితా

# బీహార్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**కాశీకి వెళ్తున్న నెల్లూరు బస్సు బోల్తా**

**ముగ్గురు యాత్రికుల దుర్మరణం**

**పలువురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు**

**ఘటనపై సిఎం చంద్రబాబు మంత్రుల దిగ్భ్రాంతి**

**బీహార్ అధికారులతో మాట్లాడాలని చంద్రబాబు ఆదేశం**

నెల్లూరు,జూన్8 :
నెల్లూరు జిల్లా నుంచి కాశీ క్షేత్రానికి వెళ్తున్న భక్తుల బస్సు బిహార్‌లో ఘోర ప్రమాదానికి గురైంది. ఔరంగాబాద్ వద్ద యాత్రికుల బస్సును ఒక లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జిల్లాలోని సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు భక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పుణ్యక్షేత్రాల దర్శనానికి వెళ్లిన తమ వారు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో బాధితుల స్వగ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 43 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో సంగం గ్రామానికి చెందిన చౌడం హజరత్తయ్య (60) ఉన్నారు. అలాగే నెల్లూరు మిలటరీ కాలనీ, దర్గా మిట్ట ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్, ఈ యాత్రకు ఆర్గనైజర్‌గా వ్యవహరించిన పసుపులేటి వెంకటేశ్వర్లు (63) ఉన్నారు. వీరితో పాటు ఆత్మకూరు వీవర్స్ కాలనీకి చెందిన తూమా పద్మావతి (43) అనే మహిళ కూడా మృతి చెందారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి సహాయక చర్యలు చేపట్టారు. బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. క్షతగాత్రులకు అందుతోన్న వైద్యంపై ఆరా తీశారు. నెల్లూరు జిల్లా నుంచి 46 మంది యాత్రికులతో కాశీ వెళ్లిన ఈ బస్సు ఔరంగాబాద్ వద్ద మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందని సీఎంకు అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, 15 మందికి గాయాలయ్యాయని వివరించారు. బిహార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి బాధితులకు సాయం అందేలా చూడాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ప్రమాదం నుంచి బయటపడిన యాత్రికులను స్వస్థలాలకు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. సీఎం ఆదేశాల మేరకు బిహార్ ఉన్నతాధికారులతో పాటు అక్కడి స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో ఏపీ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను గయాలోని అనుగ్రహ నారాయణ మగధ్ మెడికల్ కాలేజ్-హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులంతా




క్షేమంగానే ఉన్నారని అధికారులు తెలిపారు. యాత్రికులను స్వస్థలాలకు చేర్చే అంశంపై బిహార్ ప్రభుత్వంతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. జిల్లా యాత్రికుల మృతిపై మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ప్రమాద వార్తపై తక్షణమే స్పందించిన మంత్రి నారాయణ.. బిహార్ అధికారులతో అత్యవసర సంప్రదింపులు జరిపారు. రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా వాసుల మృతిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర దిగ్భ్రాం÷-రతి చెందారు. జిల్లా యాత్రికుల మృతిపై విచారం వ్యక్తం చేశారు. బిహార్ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.


## పరీక్షలంటే తెఇయని వారు విమర్శలా

విద్యార్థులకు జగన్ క్షమాపణలు చెప్పాలి

ఇక్కడ చాలదన్నట్లు తెలంగాణలోనూ భూ కబ్జాలు

జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు

భీమవరం,జూన్8 : నా దగ్గర తోక జాడిస్తే చూస్తూ ఊరుకోను. నేను సీఎంగా ఉన్నంతవరకు ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టనని సిఎం చంద్రబాబు హెచ్చరించారు. సిద్ధాంతంలో పట్టాదారు పుస్తకాల జారీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీవి అన్నీ తప్పుడు ప్రచారాలే. నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర వైసీపీది. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాకే జగన్ రాజకీయాలు చేసుకోవాలని హెచ్చరించారు. వివేకాను చంపి.. నా చేతిలో గొడ్డలి పెట్టారు. జగన్ వంటివారికి ఎప్పటికప్పుడు బుద్ధి చెప్పాలి. పరీక్షలు అంటే తెలియనివాళ్లు విమర్శలు చేస్తున్నారని అంటూ సీఎం



దుయ్యబట్టారు. తెలంగాణలోనూ వైసీపీ నేతలు భూములను కాజేయాలని చూశారని సీఎం తెలిపారు. ఇక్కడ చాలదన్నట్లు.. తెలంగాణలోనూ కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. కోడికత్తి డ్రామాలు చేసేవారికి రైతుల బాధలు తెలియవన్నారు. తిరుమల దేవదేవుడి అంశంలోనూ ద్రోహం చేశారని మండిపడ్డారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని అపవిత్రం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే దుర్మార్గులను దూరం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. ఒక్క పరిశ్రమ రాలేదని.. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డులు తారుమారు కావడం వల్ల అనేక వివాదాలు తలెత్తాయి. ఒకప్పుడు బ్రిటిష్ కాలం నుంచి కొనసాగిన పటిష్టమైన భూ రికార్డుల వ్యవస్థ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు తక్కువగా ఉండేవి. కానీ గత పాలకుల నిర్వాకంతో భూ యాజమాన్య సమస్యలు పెరిగిపోయాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట తీసుకొచ్చిన చట్టం రైతుల భూములపై అనిశ్చితి సృష్టించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి రైతుల యాజమాన్య హక్కులను కాపాడామని వివరించారు.

## ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయి..

**సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణం**

**అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలి**

**నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,జూన్8 :
అర్జీల పరిష్కారంలో ప్రజల సంతృప్తే పనితీరుకు గీటురాయని.. సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణమన్న విషయాన్ని గుర్తించి అధికారులు ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. అంతకుముందు కలెక్టర్ లక్ష్మీశ శాఖల



వారీగా అర్జీల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంతవరకు ఎన్ని అర్జీలు అందాయి? ఎన్ని పరిష్కరించారు? పరిష్కార నాణ్యత.. తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత ప్రజాస్నేహపూర్వకంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం జిల్లాస్థాయి అధికారులు స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి, సమస్య పరిష్కారంపై వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కార నాణ్యతపై పూర్తి బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్జీలు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులను స్వీకరించే సమయంలోనూ, పరిష్కరించే ప్రక్రియలోనూ అధికారులు నిబద్ధత, సహానుభూతితో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా సేవలు అందించడమే ప్రతి అధికారి ప్రధాన బాధ్యతగా భావించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 151 అర్జీలు రాగా.. వీటిలో పురపాలన, పట్టణాభివృద్ధి శాఖకు 33, రెవెన్యూకు 29, పంచాయతీరాజ్‌కు 17, పోలీసు శాఖకు 14 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌కు 9 అర్జీలు రాగా విద్య, ఆరోగ్యం, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు ఆరు చొప్పున అర్జీలు వచ్చాయి. విద్యుత్, డీఆర్‌డీఏ, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు నాలుగు చొప్పున , పౌర సరఫరాలు 3, ఏపీఎస్ ఆర్టీసీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, రహదారులు-భవనాల శాఖలకు రెండు చొప్పున అర్జీలు అందాయి. బీసీ సంక్షేమం, సహకార, డ్వామా, ఎండోమెంట్, గృహ నిర్మాణం, ఇరిగేషన్, ఎల్‌డీఎం, ఆర్ఐవో, నైపుణ్యాభివృద్ధి విభాగాలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిపెట్టి నిర్దేశ గడువులోగా నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం

మొదటిపేజీ తరువాయి..

మార్కెట్‌లో గజం రూ.2 లక్షలకు పైగా విలువ చేసే హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయిక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారులు తేల్చారు. ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలనలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ భూములను కాజేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ దందాలకు పాల్పడిన అధికారులపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వ ఆస్తులను దోచుకునేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రాము నాయిక్‌పై 2016 నుంచే వివిధ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. విజయనగర్ కాలనీ భూ వ్యవహారాలు, తుల్జాగూడ, లక్ష్మీగూడ, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లోని భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై అధికారులు విచారణను ముమ్మరం చేశారు. సబ్ రిజిస్ట్రార్ల పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోంది. అక్రమ సేల్ డీడ్‌లను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూ దందాలకు సహకరించిన ఓ సూపరింటెండెంట్‌ను రెవెన్యూ శాఖ డిస్మిస్ చేసింది. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. భూకబ్జాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టగా.. తీగ లాగితే డొంక కదిలినట్లు భూ దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

## మహిళా శక్తి మహాసభకు
# సర్వం సిద్ధం

మొదటిపేజీ తరువాయి..

4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే



కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అ÷-దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. ÷రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఈ మహాసభలో భాగస్వామ్యం కావాలని, మహిళా ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## గ్రామాల వికాసమే ప్రభుత్వ లక్ష్యం
### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్,జూన్8(సాక్ష్యం): గ్రామాల వికాసమే ప్రభుత్వ లక్ష్యమని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలోని నార్నూర్ మండలం కొత్తపల్లి (హెచ్) గ్రామంలో సర్పంచ్ చౌహన్ దిగంబర్ అధ్యక్షతన సోమవారం ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. ప్రత్యేక గ్రామ సభల ద్వారా సమస్యలు తెలుసుకుని దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. వానాకాలం ప్రారంభం కావడంతో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శు భ్రతతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపించకుండా, ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహా సూచనలు తప్పనిసరిగా పాటించాల న్నారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన మరుగుదొడ్డి, ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సమావేశంలో ఉట్నూర్ ఆర్డీవో మోహన్ సింగ్, డీఎల్‌పీవో ప్రభాకర్, ఏడీ శ్రీధర్ స్వామి, తహసీల్దార్ జాడి రాజా లింగం, ఎంపీడీవో పూల్లారావ్, డీఈ శ్రీనివాస్, వైద్యాధికారి జితేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఆకాష్, పంచాయతీ కార్యదర్శి మనోజ్, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మొదటిపేజీ తరువాయి..

సహాయం తీసుకోనున్నారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్య జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈ వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో క్వశ్చన్ పేపర్లను ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించే రవాణా సమయంలోనే లీకేజీ ముఠాలు చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో సరికొత్త చర్యలు చేపడుతున్నారు. దీని ప్రకారం.. క్వశ్చన్ పేపర్లను అత్యంత సురక్షితమైన ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. దీనివల్ల రవాణాలో జరిగే ఆలస్యం తగ్గడమే కాకుండా.. అనధికారిక వ్యక్తులు క్వశ్చన్ పేపర్లను తాకే అవకాశం కూడా ఉండదు. ఈసారి భద్రతను ఏ స్థాయిలో పటిష్టం చేశారంటే.. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష జరిగే జూన్ 21వ తేదీ వరకూ ఒక రహస్య ప్రాంతంలో పూర్తిగా నిర్బంధంలో ఉంచారు. బయటి ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. క్వశ్చన్ పేపర్ల బాక్సులకు హైటెక్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలిస్తారు. రీ-ఎగ్జామ్‌కు ముందు సోషల్ మీడియాలో నకిలీ పేపర్లు అమ్ముతూ విద్యార్థులను మోసం చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు.. మరోవైపు సైబర్ విభాగాన్ని రంగంలోకి దించారు. గతంలో జరిగిన తప్పుల కారణంగా పరీక్ష రద్దయినందున, ఈ రీ-టెస్ట్ కోసం హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయడం లేదని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. దీనికి అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, అభ్యర్థులు ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్టీఏ కోరింది. మరో రెండు వారాల్లో నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ జరగనుంది. పేపర్ లీక్ ఆరోపణలతో ఇప్పటికే ఓసారి పరీక్షను రద్దు చేయడంతో రీ-టెస్ట్ నిర్వహణ విషయంలో ఎన్టీఏ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. పేపర్ తయారీ దశ నుంచే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ యూజీ పేపర్ తయారుచేసిన నిపుణులు, పర్యవేక్షకులు, ట్రాన్స్‌లేటర్లు సహా ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ప్రస్తుతం అత్యంత భద్రత కలిగిన రహస్య ప్రాంతంలో ఉంచినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. వీరిపై భద్రతా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉ ంచారని తెలిపాయి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలేవీ వీరికి అందుబాటులో ఉంచలేదట. కేవలం



అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ఈ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పిస్తున్నారు. జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్ పూర్తయ్యేంతవరకు వీరు ఈ లాక్‌డౌన్‌లోనే ఉండనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. పేపర్ తయారీ నుంచి ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ వరకు అన్ని దశల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలుచేస్తున్నారు. పేపర్ రవాణా కోసం వాయుసేన విమానాలను వినియోగించనున్నారు. ఇదిలాఉండగా.. రీ-ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. దీన్ని ఎన్టీఏ తీవ్రంగా ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 వరకు నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ జరగనుంది.

# బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుదాం

మొదటిపేజీ తరువాయి..

భాగస్వామ్యం కలిగిన కొన్ని పార్టీలు సైతం కాంగ్రెస్‌పై తరచు విమర్శలు చేస్తుండటంపై రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసారు. గత లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ, బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదని, అయితే అంతర్గత కుమ్ములాటతోనే మనకు మనం బలహీనమవుతున్నాయనే విషయాన్ని విపక్షాలు గుర్తించాలని సూచించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లు సాధించినప్పటికీ ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లకే పరిమితమైంది. 2019లో 52 సీట్లు మాత్రమే దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు




సాధించిన కాంగ్రెస్ పార్టీ అనంతరం జరిగిన 2024 ఎన్నికల్లో 99 స్థానాలు గెలుచుకుంది. ఇటీవల లోక్‌సభలో విపక్షాలన్నీ ఏకతాటిపై నిలబడటంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విజన బిల్లు వీగిపోయింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జరిగిన సుమారు నెలరోజుల్లోనే 'ఇండియా' కూటమి తాజాగా ఢిల్లీలో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో అస్సాం, బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించగా, కేరళలో కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాడులో టీవీకే విజయ్ విజేతగా నిలిచారు. పూర్తి మెజారిటీ రాకపోవడంతో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల మద్దతుతో అధికారం చేపట్టారు. కాగా, మూడేళ్ల క్రితం జాతీయ స్థాయిలో ఏర్పడిన 'ఇండియా' కూటమి ఇకనుంచి ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని న్యూఢిల్లీ సమావేశంలో నిర్ణయించారు. తదుపరి సమావేశం వచ్చే ఆగస్టులో హైదరాబాద్‌లో జరుపుతామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు.

మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉ ండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉ న్నాయి.

# సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం



మొదటిపేజీ తరువాయి..


అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉ పయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ను ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.

## హర్మూజ్ వద్ద భారత ప్రయాణికుల నౌకపై దాడి

మొదటిపేజీ తరువాయి..

తీరానికి దగ్గర్లో ఉన్న సమయంలో ఈ దాడి జరినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఆ నౌకలో 24 మంది భారతీయులున్నట్టు సమాచారం. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ దెబ్బతిందని, నౌకకు రంధ్రం పడిందని, దాంతో సిబ్బంది ఎస్ఓఎస్ కాల్ పంపినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ దాడి కారణంగా నౌకలోని లైఫ్ బోట్లు కూడా దెబ్బతిన్నట్టు



సమాచారం. దాడి కారణంగా ఆ ఓడలో పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. లైఫ్‌బోట్లు కూడా దెబ్బతినడంతో తరలింపు ప్రక్రియ సంక్లిష్టంగా మారినట్టు సమాచారం. కాగా, నౌకపై క్షిపణులు లేదా డ్రోన్‌లతో దాడి జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ దాడికి బాధ్యులు ఎవరనే విషయంలో స్పష్టత లేదు. ఈ దాడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది. హోర్ముజ్ జలసంధి మూసి ఉ ంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉ న్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చన్నారు.

## మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి..

ఈ బస్సులను మహిళా సంఘాలకు సీఎం రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌తోపాటు ఆర్టీసీ ఉన్నతాధికారులతో సీఎస్ రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉ ందని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, భద్రత తదితర అంశాలపై ఉ న్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తోంది. రాష్ట్ర మహిళా సాధికారత నమూనాను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ కార్యక్రమానికి వేలాదిగా మహిళలు హాజరు కానున్నారు. అందుకోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకాన్ని దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సిఎస్ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కోసం మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయూత నిస్తున్నదని అన్నారు.

## మీడియా అక్రెడిటేషన్ల జీవో పై హైకోర్టులో వాదనలు

● ప్రభుత్వ సంజాయిషీ కోరిన కోర్టు

**హైదరాబాద్, జూన్ 08:**
రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ లకు సంబంధించిన జీవో ఆర్టీ 229 పై దాఖలైన పిటిషన్ పై సోమవారం తెలంగాణ హైకోర్టు లో వాదనలు జరిగాయి. రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో నాలుగు జర్నలిస్టు యూనియన్ లకు బదులు కేవలం మూడు యూనియన్ లకే ప్రాతినిధ్యం ఇచ్చి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా జీవో 229 ని అమలు చేయడాన్ని సవాల్ చేస్తూ, ఈ జీవోను రద్దు చేయాలని ఏపీఎన్ టీవీ కరస్పాండెంట్ నంబి పర్వతాలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణకు వచ్చింది. కేసు స్వీకరించిన జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ మొహినుద్దీన్ లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది, ప్రభుత్వ తరపు న్యాయవాదుల మధ్య వాదలు జరిగాయి. మీడియా అక్రెడిటేషన్ కార్డుల జారీ కోసం ఏర్పాటైన జీవో 252 నిబంధనల ప్రకారం అక్రెడిటేషన్ కమిటీలో నాలుగు యూనియన్ లను తీసుకోవాల్సి ఉండగా,అట్టి నిబంధనలను తుంగలో తొక్కి కేవలం మూడు యూనియన్ లతోనే కమిటీ ఏర్పాటు చేసి అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది రఘు వాదనలు వినిపిస్తూ, జీవో 229 ని రద్దు చేయాలని కోర్టును కోరారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ మొహినుద్దీన్స్ లు ప్రభుత్వ తరపు ప్రత్యేక న్యాయవాదిని సంజాయిషీ అడిగారు. ఈ రిట్ పిటిషన్ కు సంబంధించిన ఫైల్ తనకు అందలేదని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదించగా, పిటిషన్ కాపీలు జీపీకి ఇవ్వకుండా కోర్టులో కేసు నెంబర్ నమోదు కావడం అసాధ్యమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న కోర్టు కేసును వాయిదా వేసింది.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● సర్పంచ్ బానోతు సునిత బాలక్రిష్ణ



**ఖానాపురం జూన్ 8 (సాక్ష్యం న్యూస్ ) :**
ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి, క్వాలిఫైడ్ టీచర్‌లతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని బాలుతండా సర్పంచ్ బానోతు సునిత బాలక్రిష్ణ అన్నారు.ఖానాపురం మండలం బాలుతండాలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట ద్వారా ఎన్రోల్మెంట్ పెంచాలని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ స్కూల్ లో కంటే ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ టీచర్ లు ఉన్నారని, ఫీజుల భారం లేకుండా, పౌష్టిక మధ్యాహ్న భోజనం, రాగి జావా, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్ అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా మన గ్రామ పాఠశాలలో గ్రామ విద్యార్థులను చేర్పించాలని గ్రామ సభ ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. వార్డుమెంబర్ బానోత్ సరోజన తన కూతురిని ,మేడి కిరణ్ తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ ఏం రమేష్, కార్యదర్శి స్రవంతి ఉపసర్పంచ్ కదిరె ఏల్లగౌడ్, వార్డుమెంబర్స్, మహిళ సంఘ సభ్యులు, అంగన్ వాడీ టీచర్లు, ఏఎన్ ఎంలు తదితరులు పాల్గోన్నారు.

### మీ వార్తను పత్రికా శైలిలో

## కొంత మెరుగుపరచి ఇలా ఇవ్వవచ్చు

● భవాని నగర్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: కాలనీ వాసుల ధర్నా

**ఉప్పల్, జూన్ 8 (సాక్ష్యం):**
నాచారం డివిజన్ పరిధిలోని భవాని నగర్ కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీ అధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని వర్షపు నీటి కాలువలు పూడికతో నిండిపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. స్ట్రీట్ నంబర్ 3, 4, 5లలో రహదారులు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలకు రాకపోకలు కష్టసాధ్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతలేని డ్రైనేజీ పనుల కారణంగా సమస్యలు మరింత పెరిగాయని, పలు చోట్ల మాన్‌హోల్ కవర్లు పగిలిపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. కాలనీలో మహిళల సంక్షేమం కోసం నిర్మించాల్సిన మహిళా భవన్ ఎన్నో సంవత్సరాలుగా శంకుస్థాపనలకే పరిమితమైందని, వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న డిప్యూటీ కమిషనర్, ఇంజినీరింగ్



అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సుమారు తొమ్మిది నెలలుగా నిలిచిపోయిన పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ధర్నాలో సి. వినోద్, కృష్ణారెడ్డి, బి. హరినాథ్ రెడ్డి, ఆనంద్ కుమార్, అభిషేక్ గౌడ్, ఎస్. సురేందర్, టి. హెచ్. రాయుడు, జె. శ్రీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పి. సాంబశివరావు, రాములు, తోట రమేష్, కాళిదాస్, గోల్డ్ రమేష్, జె. శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, వెంకటేష్, భాస్కరాచారి, బి. మధుసూదన్ రెడ్డి, సత్యలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

కాశీ సతీష్ కుమార్

**సికింద్రాబాద్, జూన్ 8 (సాక్ష్యం):**
దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కుల హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని బహుజన రక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దళిత క్రైస్తవ నాయకుడు కాశీ సతీష్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీలో జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ నేతృత్వంలోని దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కుల హోదా పరిశీలన కమిషన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత మార్పిడి జరిగినప్పటికీ దళిత క్రైస్తవులు ఇప్పటికీ కుల వివక్ష, ఆర్థిక వెనుకబాటుతనం, విద్యా మరియు ఉపాధి అవకాశాల కొరతను ఎదుర్కొంటున్నారని తెలిపారు. 1950 రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్‌లోని మతపరమైన పరిమితుల కారణంగా దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలను కోల్పోయారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని సమానత్వం, సామాజిక న్యాయం, మత స్వేచ్ఛ సూత్రాలకు అనుగుణంగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను




పునరుద్ధరించాలని కోరారు. అలాగే బీసీ-సి రిజర్వేషన్ శాతాన్ని పెంచడంతో పాటు ప్రత్యేక రిజర్వేషన్ వర్గం లేదా ఎస్సీ-ఈ ఉపవర్గాన్ని ఏర్పాటు చేసి తగిన రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా కమిషన్ సానుకూల సిఫార్సులు చేయాలని కాశీ సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా బాచుపల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం

### కొత్త మౌలిక వసతుల ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమం

**హైదరాబాద్**
తెలంగాణ ప్రభుత్వం, హెచ్ఎండీఏ/హెచ్‌జీసీఎల్ ద్వారా నగర రవాణా సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రహదారి భద్రతను పెంపొందించడం మరియు హైదరాబాద్ పశ్చిమ అభివృద్ధి కారిడార్‌లో అనుసంధానాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపడుతోంది.

**1. బాచుపల్లి ఫ్లైఓవర్**
మియాపూర్ క్రాస్‌రోడ్స్ నుండి గండిమైసమ్మ వరకు సాఫీగా ట్రాఫిక్ ప్రవాహం సాగేందుకు బాచుపల్లి క్రాస్‌రోడ్స్ వద్ద హెచ్ఎండీఏ బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసింది.









ఈ ప్రాజెక్టు ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడం, రహదారి భద్రతను మెరుగుపరచడం మరియు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి సమర్థవంతమైన అనుసంధానాన్ని అందించడం కోసం రూపొందించబడింది. ఈ ఫ్లైఓవర్ 1.30 కి.మీ. పొడవుతో, 4 లేన్ల రహదారి (17.5 మీటర్ల వెడల్పు), 19 పియర్లు/అబట్‌మెంట్‌లతో నిర్మించబడింది. అదనంగా 1.30 కి.మీ. పొడవైన రెండు లేన్ల స్లిప్ రోడ్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ ప్రాజెక్టు రూ.65.53 కోట్ల వ్యయంతో పూర్తి చేయబడింది.

**2. ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.1కూ సమీపంలో మూసీ నదిపై ప్రధాన వంతెనల నిర్మాణం**
హెచ్‌జీసీఎల్, ఓఆర్ఆర్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్ల కోసం ప్రధాన వంతెనల నిర్మాణంతో పాటు, ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.1కూ ఇంటర్‌చేంజ్ నుండి నర్సింగి రింగ్ రోడ్ వరకు కొత్త సర్వీస్ రోడ్ నిర్మాణాన్ని సుమారు రూ.229.00 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిస్తోంది. ప్రస్తుతం ఉన్న లో-లెవల్ కాజ్‌వేలు వరదల సమయంలో మునిగిపోవడం, నంది సర్కిల్ సమీపంలో ట్రాఫిక్ రద్దీ మరియు ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.1కూ వద్ద తలెత్తుతున్న రవాణా సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు.
ఈ పనుల్లో ప్రధాన వంతెనల నిర్మాణం, అప్రోచ్ రోడ్ల ఎత్తు పెంపు, డ్రైనేజీ మరియు రక్షణ పనులు, ట్రాఫిక్ భద్రతా చర్యల ఏర్పాటు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా అన్ని కాలాల్లో నిరంతర రవాణా సౌకర్యం, ట్రాఫిక్ ప్రవాహం మెరుగుదల, రహదారి భద్రత పెంపు మరియు నర్సింగి, కోకాపేట్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం కలుగుతుంది. పరిపాలనా అనుమతి మంజూరైంది, త్వరలోనే టెండర్లు ఆహ్వానించబడనున్నాయి.

**3. నానక్‌రామ్‌గూడ నుండి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ ప్రధాన రహదారి (వీజఔ) విస్తరణ**
గచ్చిబౌలి సమీపంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ మరియు అడ్డంకులను తగ్గించేందుకు హెచ్‌జీసీఎల్, నానక్‌రామ్‌గూడ నుండి గచ్చిబౌలి వరకు 1.75 కి.మీ. పొడవున ఓఆర్ఆర్ ఎడమ ప్రధాన రహదారి (వీజఔ) విస్తరణ పనులను సుమారు రూ.26.50 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతోంది. ఈ ప్రాజెక్టులో అదనపు లేన్ ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న వాహన అండర్‌పాస్‌లు (ఎఖూం) మరియు కల్వర్టుల విస్తరణ, జంక్షన్‌ల అభివృద్ధి వంటి పనులు ఉన్నాయి. ఈ పనుల ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడం, వాహనాల రాకపోకలు సులభతరం కావడం, ప్రయాణ సమయం తగ్గడం, రహదారి భద్రత పెరగడం మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఐటీ కారిడార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానం లభిస్తుంది. ఈ ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి మంజూరైంది. పనులను లిఎం/ఎస్ సుధాకర ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌లి సంస్థకు అప్పగించారు.

> (ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.1కూ సమీపంలో మూసీ నదిపై ప్రధాన వంతెనల నిర్మాణం నానక్‌రామ్‌గూడ నుండి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ ప్రధాన రహదారి (వీజఔ) విస్తరణ)



## బొడ్మట్‌పల్లిలో ప్రజా పాలనకు బలమైన బాట

- ● 99 రోజుల యాక్షన్ ప్లాన్‌తో గ్రామాభివృద్ధికి వేగం..!
- ● బహిరంగ మలవిసర్జనకు చెక్..!
- ● చెత్త వర్గీకరణ తప్పనిసరి – డీపీఓ యాదయ్య స్పష్టం
- ● పారిశుధ్యం, తాగునీరు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- ● "మన పిల్లలు మన పాఠశాలలోనే చదవాలి" ● సర్పంచ్ అవినాష్ కుమార్ పిలుపు






**మెదక్ జిల్లా,టేక్మాల్, జూన్ 8:(సాక్ష్యం న్యూస్ ) :-**
మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ గ్రామాభివృద్ధి దిశగా కీలక మలుపుగా నిలిచింది. "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్"లో భాగంగా గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ సమావేశంలో గ్రామ ప్రజలకు పారిశుధ్యం, చెత్త వర్గీకరణ, పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) యాదయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ చెత్త, విషపూరిత చెత్తను విడివిడిగా సేకరించి గ్రామపంచాయతీకి అందించాలని సూచించారు. చెత్తను శాస్త్రీయంగా వర్గీకరించడం ద్వారా పరిశుభ్రమైన గ్రామాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించిన ఆయన, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మొక్కల సంరక్షణ, పన్నుల వసూళ్లు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బహిరంగ మలవిసర్జనకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టాలని స్పష్టం చేసిన డీపీఓ యాదయ్య, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని





తెలిపారు. అవసరమైన వారికి స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల మంజూరుకు కృషి చేస్తామని వెల్లడించారు. గ్రామ నర్సరీలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం నిర్వహణతో పాటు వీధి దీపాలు, శానిటేషన్ వ్యవస్థలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజల భాగస్వామ్యంతో బొడ్మట్‌పల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే "మన పిల్లలు మన పాఠశాలలోనే చదవాలి" అనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పారిశుధ్య కార్యక్రమాలపై విశేష ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో తులసిరాం, ఉపసర్పంచ్ మాధవి నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి రాందాస్ చౌహాన్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, వీఓ లీడర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పారిశుధ్య కార్యక్రమాలపై విశేష ఆసక్తి కనబరిచారు. గ్రామ ప్రజల సహకారంతో ప్రత్యేక గ్రామసభ విజయవంతంగా నిర్వహించబడింది.

## జిల్లా ఎస్పీని సన్మానిస్తున్న పలువురు ఎన్జీవోల ప్రతినిధులు..!

● ఎర్రగొండపాలెంలో ఘనంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. ● ప్రజల అర్జీలకు సత్వర న్యాయం అందిస్తాం: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు..

**మార్కాపురం జిల్లా బ్యూరో ఇంఛార్జీ : సాక్ష్యం**
పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మరింత చేరువయ్యేందుకు చేపట్టిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక " కార్యక్రమం సోమవారం ఎర్రగొండపాలెంలో అత్యంత విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రకాశం జిల్లా ఎస్పీ,మార్కాపురం జిల్లా ఇన్చార్జి ఎస్పీగా అదనపు బాధ్యతలు చేపట్టిన వి. హర్షవర్ధన్ రాజు,ఐపీఎస్ హాజరై ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించారు. ప్రజలు స్వయంగా హాజరై భూ వివాదాలు, సైబర్ మోసాలు,మహిళా రక్షణ,రోడ్డు భద్రత తదితర సమస్యల పై వినతి పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడిన ఎస్పీ," ప్రతి అర్జీని చట్టపరంగా పరిశీలించి,అర్హులకు 24 గంటల్లోగా స్పందించి సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకుంటాం. పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజా సేవకు అంకితమై ఉంటుంది " అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ నాగరాజు,ఎర్రగొండపాలెం ఎస్ఐ దేవ కుమార్ ,పోలీస్ శాఖ వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీకి విజయ్ సోషల్ సర్వీసెస్ ట్రస్టు వ్యవస్థాపకులు




సంద్రపాటి విజయ్ కుమార్ , సార్స్ స్వచ్ఛంద సంస్థ ఏపిఎం మందా మరియబాబు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మూడమంచు గురవయ్య యాదవ్,ఇండియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కంచర్ల నాగేశ్వరరావు గౌడ్ లు ఎస్పీకి గౌరవార్థంగా శాలువాలతో సన్మానించడం జరిగింది.

**వేదికకు వచ్చిన ప్రధాన ఫిర్యాదులు**

1. భూ తగాదాలు,ఆక్రమణలు
2. సైబర్ మోసాలు,ఆన్‌లైన్ బెదిరింపులు
3. మహిళలు,వృద్ధుల భద్రత
4. రోడ్డు ప్రమాదాలు,ట్రాఫిక్ సమస్యలు



## సైనిక కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం




**ఖానాపురం జూన్ 8 (సాక్ష్యం న్యూస్ ) :** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం, అశోక్ నగర్ లోని సైనిక కళాశాలలో బీఎస్సీ ( ఎంపీసీ) మరియు బి ఏ (హెచ్ఈపి ) లలో ఫేస్ -2 అడ్మిషన్స్ కొరకు ఆసక్తిగల గిరిజన విద్యార్థులు దరఖాస్తులు వరంగల్ , కరీంనగర్ జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ డిఎస్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ఏ జిల్లా నుంచి అయినా, ఏ యాజమాన్యంలోని కళాశాల నుంచి అయినా 2026 మార్చ్ లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు నేరుగా సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లైన మార్క్స్ మెమో, టిసి, స్టడీ సర్టిఫికెట్ ,కులం,ఆదాయం, ఆధార్ కార్డు, పాస్పోర్ట్ ఫోటో లతో దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు అశోక్ నగర్ లోని సైనిక కళాశాలలో రిపోర్ట్ చేయాలని ,రిపోర్ట్ చేసిన అభ్యర్థులకు 12వ తేదీ ఉదయం ఆర్మీ సంబంధిత ఈవెంట్స్ నిర్వహించి అదే రోజు మెరిట్ ప్రకారంగా అడ్మిషన్స్ ఇవ్వబడతాయని తెలిపారు.ఆసక్తి గల విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని మరింత సమాచారం కోసం 9014559873, 9963584516 మరియు 9398068250 నంబర్స్ ను సంప్రదించాలని తెలిపారు.

## టీఎస్ఆర్టీసీ ఉద్యోగాల పేరుతో రూ.21 లక్షల మోసం: ప్రధాన నిందితుడు అరెస్ట్



**నాచారం, జూన్ 8 (సాక్ష్యం):** టీఎస్ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి నిరుద్యోగ యువత, మహిళల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన ప్రధాన నిందితుడిని నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో వడ్లూరి రాజశేఖర్ (37)ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు 2025 అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య నాచారం బాబానగర్‌లో కార్యాలయం నిర్వహిస్తూ, టీఎస్ఆర్టీసీ అధికారులతో తనకు పరిచయాలు ఉన్నాయని చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానని బాధితులను నమ్మించాడు. ఈ క్రమంలో నగదు, బ్యాంక్ ట్రాన్స్‌ఫర్లు, యూపీఐ లావాదేవీల రూపంలో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది.ఇప్పటివరకు 48 మంది బాధితులను గుర్తించగా, వారి నుంచి సుమారు రూ.21.35 లక్షలు వసూలు చేసినట్లు ఆధారాలు లభించాయి. ఈ మొత్తాలను నిందితుడు తన కుటుంబ సభ్యులు, సహచరుల బ్యాంకు ఖాతాల ద్వారా బదిలీ చేసినట్లు బ్యాంకు రికార్డులు వెల్లడించాయి. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు గుండ్లపల్లి ప్రవీణ్ కుమార్, నరేష్ పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. టీఎస్ఆర్టీసీ లేదా ఇతర ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించి మోసపోయిన వారు నాచారం పోలీసులను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

## ఉప్పల్ డిగ్రీ కాలేజీకి భూమి, నిధులను కేటాయించండి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన పరమేశ్వర్‌రెడ్డి



**ఉప్పల్, జూన్ 8 (సాక్ష్యం)** ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భూమితో పాటు భవనాల నిర్మాణానికి నిధులను కూడా కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఉప్పల్ భగాయత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి గారి చేతుల మీదుగా ఎంఎంసీ కార్యాలయం, 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణాలకు భూమి పూజ తర్వాత జరిగిన సభ వేదికపై వజ్రేష్ యాదవ్ గారు, పరమేశ్వర్‌రెడ్డి, రజితాపరమేశ్వర్‌రెడ్డి వినతిపత్రాలను అందచేశారు. ఉప్పల్‌లో డిగ్రీ కళాశాలను ఐదారేళ్ల క్రితమే ఏర్పాటు చేశారన్నారు. కానీ, నేటికి డిగ్రీ కళాశాల పాఠశాల భవనంలోనే నడుస్తుందన్నారు. దీంతో ఉప్పల్ భగాయత్‌లో 5 ఎకరాల స్థలంతో పాటు భవనాల నిర్మాణానికి నిధులను కేటాయించాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. తక్షణమే స్థల కేటాయింపు, నిధుల కోసం నివేదికను పంపించాలని అధికారులకు ఆదేశించారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మేలా చర్యలు తీసుకోవాలి

– ఎఓకి వినతిపత్రం అందజేశిన రైతుసంఘం నాయకులు



**పాలకుర్తి,జూన్ 07 (సాక్ష్యం):** వ్యవసాయ దుకాణాలలో విత్తనాలు ఎరువులు , పేస్టిసైడ్స్ ను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య అన్నారు. సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఏవో కి అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య పాల్గొని మాట్లాడుతూ నకిలీ మరియు నాసిరకం విత్తనాల సమస్య పెరుగుతుండటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మండల స్థాయిలో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలన్నారు, ఏఈఓ క్లస్టర్ స్థాయిలో క్రాఫ్ట్ బుకింగ్ సమయంలో రైతులు ఎక్కడినుండి విత్తనాలు కొనుగోలు చేశారు సక్రమంగా నమోదు చేయాలన్నారు. వీటి 3 వంటి అణాధికార విత్తనాలు దొడ్డిదారున రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందేలా వ్యవసాయ శాఖ తరపున పర్యవేక్షణ కఠినంగా అమలు చేయాలన్నారు, అధిక ధరల వసూళ్లు మరియు లింకింగ్ విధానాన్ని పూర్తిగా నిలిపివేయాలని పై అంశాలపై తక్షణ చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని లేనియెడల రైతుల హక్కుల రక్షణ కోసం సంఘటిత ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల సోమన్న, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షురాలు బచ్చు శ్రీలత, కార్యదర్శి బెల్లి సంపత్, గడ్డి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేఎంసీ ప్రిన్సిపల్‌గా మోహన్ దాస్ ఎంజీఎం సూపరింటెండెంట్‌గా కిరణ్ కుమార్

**హనుమకొండ, జూన్ 8 (సాక్ష్యం)** కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ డి. మోహన్ దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య సంచాలకులు డాక్టర్ ఎ. నరేంద్ర కుమార్ ప్రొసీడింగ్స్ విడుదల చేశారు.ప్రస్తుతం నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ సెలవులో ఉన్న డాక్టర్ మోహన్ దాస్, అడిషనల్ డీఎంఈ హోదాలో కేఎంసీ ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు. గతంలో కూడా కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలందించి వైద్య వర్గాల ప్రశంసలు అందుకున్నారు. మరోసారి కేఎంసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో పలువురు వైద్యులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

**ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ బన్నా కిరణ్ కుమార్**

వరంగల్ మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ బన్నా కిరణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్‌ను ఎంజీఎం ఆస్పత్రికి బదిలీ చేశారు. అనంతరం ఆయనకు సూపరింటెండెంట్ బాధ్యతలను అప్పగించారు. ఈ నియామకంతో ఆస్పత్రి అభివృద్ధి, వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని పలువురు వైద్యులు, వైద్య సంఘాల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలుగు సాహిత్య మహాసభలలో కవి మాన్యపు భుజేందర్‌కు అరుదైన గౌరవం







**పాలకుర్తి,జూన్ 07 ( సాక్ష్యం):** ఏపీలోని రాజమహేంద్రవరంలో చైతన్య సరస్వతా పరిషత్ మరియు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆరు, ఏడు తేదీలలో ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు రావలసిందిగా నిర్వాహకులు జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన కవి, కళాకారుడు పోతన సాహిత్య కళా వేదిక అధ్యక్షులు మాన్యపు భుజేందర్ కు ఆహ్వానం పంపగా భుజేందర్ రాజమండ్రిలో జరిగిన ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలలో పాల్గొని " ప్రపంచ శాంతిని కోరుకుందాం" అనే సామాజిక అంశంతో కవితా గానం చేశారు. తెలుగు భాషా ద్వారా తెలుగు సాహిత్యాన్ని తెలుగు సాంస్కృతిక వైభవాలను ప్రపంచ వేదికపై ప్రతిధ్వనింపజేసినందుకు, సాహిత్య మహాసభలలో పాల్గొని ప్రతిభతో అక్షరాలకు ఆభరణమై, కళలకు కీర్తి కిరీటమై, తెలుగు భాషకు శోభను సాహిత్య సాంస్కృతిక చైతన్యాన్ని విస్తరింపజేసి సాహితీ సుగంధాలు వెదజల్లి, కళా రంగంలో ప్రతిభా కాంతులతో భుజేందర్ అందించిన సహకారానికి అభినందిస్తూ నిర్వాహకులు జ్ఞాపిక, తలపాగా, పూలదండ, శాలువా తో ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రమును అందించినారు. ఈ సాహిత్య కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా, ఏపీ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, విద్యాసంస్థల గైట్ యూనివర్సిటీ అధినేత మాజీ ఎమ్మెల్సీ చైతన్య రాజు, శాసనసభ్యులు సీనియర్ నాయకులు జ్యోతుల నెహ్రూ, శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ కన్వీనర్ డాక్టర్ టి పార్థసారథి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బిజెపి రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు నర్సిపల్లి నిహారిక, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు తదితరులు

## బీఆర్ భగవాన్ దాస్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులు అర్పించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ, జూన్ 8 (సాక్ష్యం)** ప్రముఖ కార్మిక నాయకుడు, సీనియర్ కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి సందర్భంగా హనుమకొండ అశోక జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన వేడుకల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని వారి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ సీపీఐ పార్టీ నుంచి రాష్ట్రానికి విశిష్టమైన గుర్తింపు తీసుకొచ్చిన మహానేతల్లో భగవాన్ దాస్ ఒకరని, కార్మికులు, గుడిసెవాసులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాటం చేశారని కొనియాడారు. సాగునీటి వసతులు, ఉపాధి అవకాశాల కల్పన, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, భగవాన్ దాస్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవలో ముందుకు సాగుతున్నామని, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. పేదల స్థిర నివాసాలు, ఉపాధి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన ఉద్యమాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు ఎప్పటినుంచో ప్రజాస్వామ్య, లౌకికవాద విలువల పరిరక్షణ కోసం కలిసి పనిచేస్తున్నాయని, దేశ రాజ్యాంగాన్ని, సెక్యులర్ స్ఫూర్తిని కాపాడుకోవడంలో ఇరు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ, బీఆర్ లెనిన్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, బిఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, ఆవోపా జిల్లా అధ్యక్షులు డి. ఈశ్వరయ్య, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొన్నారు. తోట సుధాకర్, కేకే, పి. అశోక్, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను,సిపిఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరును మనమే శుభ్రం చేసుకోవాలి

– ఘన వ్యర్థం ఘన విజయంగా మార్చాలి – కొత్తూరు గ్రామాన్ని ఆదర్శవంతమైన స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి – అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి



**రాయపర్తి, జూన్ 08(సాక్ష్యం):** ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మన ఊరును మనమే శుభ్రం చేసుకోని ఘన వ్యర్థం ఘన విజయంగా మార్చుదాం అనే స్ఫూర్తి అందరిలో రావాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి అన్నారు. రాయపర్తి మండలం కొత్తూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ అధ్యక్షతన సోమవారం నాడు ప్రత్యేక గ్రామ సభ సమావేశం జరిగింది. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి హాజరై ప్రసంగించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి స్పష్టం చేశారు. గ్రామాల సమగ్ర పర్యావరణ పరిరక్షణకు, ప్రజల ఆరోగ్య రక్షణకు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు ఎంతగానో తోడ్పడతాయని, వీటిపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం చిన్న విషయం కాదు. అది మన భవిష్యత్ తరాల ఆరోగ్యానికి వేసే పెద్ద అడుగు అని అడిషనల్ కలెక్టర్ అన్నారు. తహసిల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జనాభా లెక్కల ప్రక్రియలోభాగంగా ఓటరు జాబితా సవరణ, కార్యక్రమాలలో గ్రామీణులు చురుగ్గా పాల్గొని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూచన ప్రకాశ్ మాట్లాడుతూ, పచ్చని పర్యావరణం కోసం ప్రజలు తమ సామాజిక బాధ్యతగా ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ ట్రాక్టరుకు అందించాలని కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించి కొత్తూరు గ్రామాన్ని ఆదర్శవంతమైన స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. తహసిల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై యువత అవగాహన పెంచుకోవాలని, గ్రామ సభ ద్వారా వచ్చే ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూచన ప్రకాశ్ గ్రామ ఉప సర్పంచ్ చిప్ప శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అస్మా, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

– ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి



**వర్ధన్నపేట, జూన్ 8(సాక్ష్యం):** వర్ధన్నపేట పట్టణాన్ని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నామని వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో నిర్వహించిన ప్రత్యేక వార్డు సభకు ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజల సమస్యలు, అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలపై స్థానికులతో ప్రత్యక్షంగా చర్చించారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించి, వార్డు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రతి వార్డులో ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చైర్మన్ పాలకుర్తి సారంగపాణి తెలిపారు. వార్డు పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వార్డు ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సహకారంతో ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తిరుపెల్లి వాణి,వార్డు అధికారి దీప్తి, రాజేందర్, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ కరుణాకర్, హెల్త్ అసిస్టెంట్ అనిల్, ప్రజాప్రతినిధులు తిరుపెల్లి కుమారస్వామీ, రాకేష్, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కాలేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల అన్వేషణ: ఇద్దరు వ్యక్తుల అరెస్ట్




**(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 8 :** కాలేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల అన్వేషణ -- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలోని సిసిఎస్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కాలేశ్వరం అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం అన్వేషణ జరుపుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా గత ఆరు నెలలుగా కాలేశ్వరం పరిసర ప్రాంతాల్లో గుప్తనిధుల కోసం అన్వేషిస్తున్నట్లు వారు వెల్లడించారు. వారి వద్ద నుంచి గుప్తనిధుల అన్వేషణకు ఉపయోగిస్తున్న ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వ్యక్తులు వివరాలు ఇంజారపు వెంకటరమణ ప్రసాద్, టీచర్స్ కాలనీ, ఆదిలాబాద్ . వలబోజు శ్రీనివాస్, సుధా నగర్, హనుమకొండ వారి దగ్గర స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాలేశ్వరం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీసీఎస్ సీఐ రమేష్ తెలిపారు. గుప్తనిధుల పేరుతో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## రైతులకు ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచాలి

### జాతీయ కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి



**మాడుగులపల్లి జూన్ 8 సాక్ష్యం;**
మాడుగులపల్లి మండల కేంద్రంలోని సోమవారం బిజెపి కార్యాలయంలో మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సరైన సమయంలో ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని అదేవిధంగా రైతులకు సేంద్రియ పద్ధతి ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని రసాయనిక ఎరువులను తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని ఇట్టి విషయంపై రైతులకు రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా నకిలీ విత్తనాలను అరికట్టాలని ఎవరైనా రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలను విక్రయించినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి, జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, జిల్లా నాయకులు చిలుముల శ్రీనివాస్ రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ దారమళ్ళ నాగరాజు, మండల నాయకులు దాసరి యాదగిరి, రామలింగయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, ధరల పెంపుతో ప్రజలపై పెను భారం మోపుతున్న మోడీ సర్కార్

### – సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి జహంగీర్




**చౌటుప్పల్ జూన్ 8 (సాక్ష్యం)**
దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో మోడీ సర్కార్ దేశ ప్రజల కు పెనుబారం మోపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి జహంగీర్ అన్నారు. సోమవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచి ప్రజల ను మరోసారి మోసం చేసిందని అన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని అన్నారు. నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అని విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదే పదే ప్రకటించినది అని గుర్తు చేశారు. ఫలితాలు వచ్చిన నెల రోజులలో ఇప్పటికీ మూడు దఫాలుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల కోసం మోడీ అబద్ధాలు చెబుతున్నారని ప్రజలు భావిస్తున్నారని, ఇది విశ్వాస ఘాతకం, అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడ బూర్గు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, రాగిరికిష్టయ్య, గడ్డం వెంకటేశం, మండల నాయకులు చీర్క సంజీవరెడ్డి, బోయ యాదయ్య, పొట్ట శ్రీనివాసు, బోధసు వెంకటేశం, కొండే శ్రీశైలం, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, చీరిక అలివేలు, పగిళ్ల శశిరేఖ, యాట బాలరాజు, రత్నం శ్రీకాంత్, కొంతం శ్రీనివాస్ రెడ్డి, నేరేడు మహేష్, జక్కిడి రమణారెడ్డి, మానే సాలయ్య, పల్లె సత్యం, బోదాసు స్వాతి, పాలమాకుల పుష్ప, నక్క జయసుధ, జంగం వెంకటమ్మ, సంజీవ రమేష్, యాట ముత్యాలు, రమేష్, జంగం అంజయ్య, ఫకీర్ పెంటారెడ్డి, చెరుకు అంజయ్య, ఎస్.కె మదర్, వెంకటేశం పాల్గొనడం జరిగింది.

## చౌటుప్పల్ మున్సిపాలిటీని మోడల్ సిటీగా మార్చడమే లక్ష్యం

### – మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్ జూన్ 8 (సాక్ష్యం )**
మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ మోడల్ సిటీగా మార్చడమే తమ లక్ష్యం అని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. సోమవారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో 7, 16, 17, 18, 20 వార్డులలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వివిధ వార్డు సభలను నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, పాల్గొని మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జూన్ 2 నుంచి అమలుచేయబోతున్న 'అందరికీ జీవిత బీమా' పథకం గురించి వార్డు ప్రజలకు తెలియజేశారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలోని ప్రతి వార్డులలో పారిశుద్ధ్యం, తాగునీరు, వనమహోత్సవం మరియు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పర్యావరణ వారోత్సవంలో భాగంగా మున్సిపల్ వార్డుల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటుటకు కార్యచరణ రూపొందిస్తామని అన్నారు. ప్రతి వార్డులో బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించాలని దానికి పోలీస్ శాఖ వారి సహకారం ఉండాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినటువంటి వారికి ప్రత్యేక ఐడి కార్డులను ఇచ్చేలా పోలీస్ శాఖ చూసుకోవాలని, తద్వారా మున్సిపాలిటీలో నేరాలు అదుపులో ఉంటాయని తెలియజేశారు. ప్రతి వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ పట్టణాన్ని ఆదర్శవంతమైన అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో ఉన్న ప్రజా సమస్యలను వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో, శక్తివంచన లేకుండా పరిష్కరిస్తామని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ.. ప్రజలు చెత్తను మున్సిపల్ చెత్త ఆటోకు మాత్రమే ఇవ్వాలని సూచించారు. అలా కాకుండా బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల ఇరుపక్కలా, డ్రైనేజీలలో చెత్త వేస్తే జరిమాణాలు తప్పవని తెలిపారు. ఎస్సై కృష్ణ మాన్ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల యజమానులు ఇతర రాష్ట్రాల వారికి ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు వారి ఆధార్ కార్డు మరియు ఇతర వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. డాక్టర్ కాటంరాజు మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ వార్డు సభలలో ఆయా వార్డుల కౌన్సిలర్లు ఆలే చిరంజీవి, బత్తుల జయమ్మ దాసుగౌడ్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, హన్ను బాయి, కో ఆప్షన్ సభ్యులు ఎండి బాబా షరీఫ్, గంగ రాములు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.









## తక్కువ నీటి లభ్యతలో పండే పంటలను సాగు చేయాలి

### – జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, 8 జూన్ (సాక్ష్యం)**
వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నెక్కొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జూన్ మొదటి లేదా మూడో వారంలో వర్షాలు కురిస్తే వరితో పాటు అంతర్ పంటలను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు చేయాలని, జూలైలో వర్షాలు ప్రారంభమైతే తక్కువ నీటి అవసరం ఉన్న కందులు, మినుములు, పత్తి, మొక్కజొన్న వంటి పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. పంట దిగుబడులు పెంచుకోవాలనే ఉద్దేశంతో అధిక రసాయన ఎరువులు, పురుగుమందులు వాడరాదని కలెక్టర్ హెచ్చరించారు. రసాయనాల అధిక వినియోగం వల్ల మానవ ఆరోగ్యానికి ముప్పు ఏర్పడటమే కాకుండా నేల సారవంతత కూడా దెబ్బతింటుందని చెప్పారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, తడి చెత్త, పొడి చెత్త, బయో వేస్ట్, సానిటరీ వేస్ట్‌లను వేర్వేరుగా సేకరించి రీసైక్లింగ్‌కు సహకరించాలని సూచించారు. వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జనాభా లెక్కల కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ కోరారు. సరైన ధ్రువపత్రాలతో అధికారులకు సహకరించడం ద్వారా ఓటు హక్కు పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఆడపిల్లల విద్యకు కుటుంబాలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని స్వతంత్రంగా ఎదిగేలా ప్రోత్సహించాలని సూచించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యంతో పాటు కుటుంబాభివృద్ధిపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొంటూ తల్లిదండ్రులు అలాంటి వాటిని నిరోధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి ఎంపీడీవో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ సంబంధిత అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే గండ్ర




**(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 8:**
రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మొగుల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొగుల్లపల్లి మండలంలో ఇప్పటికే పూర్తయిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర విద్యుత్ సంబంధిత సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో అమలు చేస్తున్న ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, రవాణా సౌకర్యాల వంటి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. సాదా బైనామా భూములకు చట్టబద్ధ హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామప్రజలు, రైతులు సంఖ్యలో పాల్గొన్నారు.

## అందుకు తండ గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత

### – ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 8 :** అందుకు తండ గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత -- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చిట్యాల మండలంలోని అందుకు తండ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందుకుతుతండ గ్రామంలో తాగునీరు, రోడ్లు, సైడ్ డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. మహిళా సంఘ భవనం, అంగన్‌వాడీ భవనం నిర్మాణాన్ని మంజూరు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రైతులకు పంటల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ, పంట అవశేషాలను కాల్చకుండా భూమి సారాన్ని పెంపొందించే పద్ధతులను వివరించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కనకదుర్గ ట్రాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**చిట్యాల జూన్ 08(సాక్ష్యం);**
చిట్యాల పట్టణంలోని శ్రీ బాల నరసింహ స్వామి దేవస్థానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గ ట్రాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ ఎన్నికలో భాగంగా గుంజ కృష్ణ అధ్యక్షుడిగా, ఏర్పుల స్వామి గౌరవ అధ్యక్షుడిగా, ఆగు వెంకన్న ఉపాధ్యక్షుడిగా, సాగర్ల పవన్ కోశాధికారిగా, జిట్టా సైదులు ప్రధాన కార్యదర్శిగా మరియు వరికుప్పల పరుశురాములు సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు గుంజ కృష్ణ మాట్లాడుతూ, అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, తన ఎన్నికకు సహకరించిన అసోసియేషన్ పెద్దలకు మరియు శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధి మరియు సభ్యుల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం వెల్లడించింది. దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, సభ్యుల ఐక్యతతో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయాలని వారు నిర్ణయించుకున్నారు.



## ఘన సన్మానం




**యాదాద్రి భువనగిరి సాక్ష్యం**
యాదాద్రి భువనగిరి నూతన బాధ్యతలు చేపట్టిన సంగం నరేష్ కి శుభాకాంక్షలు తెలియజేసిన యాదాద్రి భువనగిరి జిల్లా ౧=ూహీూ జిల్లా కార్యవర్గం కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాలకూర్ల వెంకటేశం, జిల్లా కార్యదర్శి శ్రీరాములు, పట్టణ అధ్యక్షులు చిన్నప్ప, మండల అధ్యక్షుడు యాదయ్య, కాకతీయ స్కూల్ కరస్పాండెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం, ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి: దేవరకొండ ఎంఈఓకి ఏబీవీపీ వినతి"




**దేవరకొండ: జూన్ 8 (సాక్ష్యం)**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో దేవరకొండ మండల విద్యాశాఖాధికారి ( ఎంఈఓ) ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ మరియు విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సంబంధించి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ దేవరకొండ నగర కార్యదర్శి పగిళ్ల విక్రమ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, ఫర్నిచర్ మరియు ఇతర విద్యా సౌకర్యాల లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు మరియు ఇతర విద్యా సామగ్రి అందేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును తప్పనిసరిగా అమలు చేసి, పేద మరియు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పై సమస్యలపై విద్యాశాఖ వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ తరఫున కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్, టౌన్ జాయింట్ సెక్రెటరీ గుండాల శివరామరాజు, యలమల హేమ సుందర్, శంకర్, రాకేష్, గౌతమ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్లకుంటలో గ్రామ సభ



**కోదాడ జూన్ 08(సాక్ష్యం)**
ప్రజాపాలనలో భాగంగా రెడ్లకుంట గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామసభ ఎంతో ప్రశాంతంగా, విజయవంతంగా జరిగింది. ఈ గ్రామసభకు ఎంఈఓ సలీం షరీఫ్ హాజరై మాట్లాడుతూ విద్యతో పాటు పలు అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ పోలంపల్లి కుటుంబరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజలు తెలిపిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లెల ప్రసాద్, గ్రామ కార్యదర్శి నాగలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు నరేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## గుడికుంట తండాలో గ్రామసభ



**పాలకుర్తి, జూన్ 07 (సాక్ష్యం):**
సోమవారం రోజు గుడికుంట తండ గ్రామ పంచాయతీలో సర్పంచ్ బానోతు మహేందర్ నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించడం జరిగింది . ఈ గ్రామ సభలో అన్ని శాఖల అధికారులు ,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది . ఈ గ్రామసభలో గ్రామ ప్రజలు సమస్యలను వివరించడం జరిగింది. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని అధికారులు తెలిపారు.

## సింగరేణి సమస్యలు పరిష్కరించాలి

### సమస్యలపై సమ్మె నోటీసులు జారీ

గోదావరిఖని,జూన్8(సాక్ష్యం): సింగరేణి సంస్థలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి యాజమాన్యానికి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ సోమవారం సమ్మె నోటీసు జారీ చేసింది. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం ఇతర సమస్యలను పరిష్కరించక పోవడంతో విసిగి వేసారిన గుర్తింపు కార్మిక సంఘం చివరకు సమ్మె చేయడం తప్ప మరో మార్గం లేదని సమ్మె నోటీసు జారీ చేసింది.యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఆధ్వర్యంలోని నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. కాగా ఎప్పటినుండి సమ్మె చేయాలని విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇదిలావుంటే సింగరేణి సంస్థలో వెంటనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని విజిలెన్స్ మారు పేర్ల సమస్యను పరిష్కరించాలనే డిమాండ్ తో ఈనెల 13న గోదావరిఖనిలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి తెలిపారు. గోదావరిఖని పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించకుండా డిపెండెంట్ ఉద్యోగాలను అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడానికి గోదావరిఖని పట్టణంలోని విఠల్ నగర్ హనుమాన్ టెంపుల్ నుండి రామగుండం డివిజన్-1 జనరల్ మేనేజర్ కార్యాలయానికి చేపట్టిన భారీ పాదయాత్ర ఉంటుందని చెప్పారు. ఈ పాదయాత్రకు పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులు డిపెండెంట్లు హాజరు కావాలని నిరసన తెలియజేయాలని ఆయన కోరారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి సంస్థలు 18 వేల మందికి డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా మెడికల్ బోర్డు నిర్వహించకుండా కాలయాపన చేస్తోందని ఆయన విమర్శించారు. గతంలో డిపెండెంట్ ఉద్యోగాలు పొందిన వారిపై విచారణ చేపడతామని చెప్పడం చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏ వైఖరితో ఉందనేది అర్థమవుతుందన్నారు. సింగరేణిలో జరుగుతున్న అవినీతి అక్రమాలు ఇతర అంశాలపై మాజీ మంత్రి హరీష్ రావు చేస్తున్న పోరాటానికి మద్దతుగా స్థానికంగా సింగరేణి ఉద్యోగుల డిపెండెంట్ లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

మెడికల్ బోర్డు డిమాండ్‌తో పాటు విజిలెన్స్ కేసుల పేరిట ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న అంశంపై దీనికి తోడు మారుపేర్ల సమస్యతో ఉద్యోగాలు లభించకుండా వేచి చూస్తున్న వారికి న్యాయం చేసేందుకు పోరాటం చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ నాయకుడు పర్లపల్లి రవి, బీఆర్ఎస్ నాయకులు జెవి రాజు, పున్నం, శశి కుమార్, వాసర్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టం

### అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం వెల్లడి

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే పన్నులు చెల్లించని వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే వాహనాల సీజ్‌కు ఆదేశాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు



వివరించారు. రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల పన్నులు ఎగ్గొట్టే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై చెక్ పెడతామన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్,డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

### –విజయ వంతమైన బూత్ లెవల్ ఏజెంట్స్ శిక్షణా కార్యక్రమం
### –ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం: ఎంపి కడియం కావ్య

పాలకుర్తి,జూన్ 07 (సాక్ష్యం): పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర కళ్యాణ మండపంలో పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్స్ శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమాన్ని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి , టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో బూత్ లెవల్ ఏజెంట్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య , వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , బూత్ లెవల్ ఏజెంట్స్ శిక్షణ ట్రైనర్ అల్లం కోటేశ్వరరావు , టీపీసీసీ అబ్జర్వర్ ప్రమోద్ కుమార్ , జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి , వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుంచే కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో పార్టీకి అంకితభావంతో పనిచేసే కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఓటరుతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై పనిచేసే నాయకత్వమే కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకత అని అన్నారు. ప్రతి బూత్‌లో పార్టీకి బలమైన నిర్మాణం అవసరమని, దానికోసమే ఈ శిక్షణ




కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ..ఎన్నికల్లో విజయానికి బూత్ మేనేజ్‌మెంట్ ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం సమిష్టిగా కష్టపడితే పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అపార మెజారిటీ సాధ్యమవుతుందని అన్నారు. గ్రామ స్థాయిలో బూత్ కమిటీలను మరింత చురుకుగా పనిచేయించే బాధ్యత నాయకులపై ఉందన్నారు.

శిక్షణా ట్రైనర్ అల్లం కోటేశ్వరరావు బూత్ లెవల్ ఏజెంట్లకు ఎన్నికల నిబంధనలు, ఓటర్ల జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణలు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. ప్రతి బూత్‌లో పార్టీకి అనుకూల వాతావరణం సృష్టించేందుకు వ్యూహాత్మకంగా పనిచేయాలని సూచించారు.టీపీసీసీ అబ్జర్వర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై ప్రజల్లో విశేష ఆదరణ ఉందన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు..వరంగల్ జిల్లా అధ్యక్షులు ఆయుబ్ ఖాన్ మాట్లాడుతూ..బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర ఎన్నికల్లో అత్యంత కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బిఎల్ఎ లూ ముందు వరుసలో ఉండాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు క్రమశిక్షణతో పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందని, దాన్ని ఓట్ల రూపంలోకి మార్చే బాధ్యత బూత్ స్థాయి నాయకులపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయి

### చౌటుప్పల్ ఇన్చార్జి ఎంపీడీవో బి. విజయకుమార్

చౌటుప్పల్ జూన్ 8 (సాక్ష్యం ): గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని చౌటుప్పల్ ఇన్చార్జి ఎంపీడీవో బి. విజయకుమార్ అన్నారు.




సోమవారం మండల పరిధిలోని మందోళ్ళగూడెం, కుంట్లగూడెం,నేలపట్ల, లింగోటం, జై కేసారం, అంకిరెడ్డిగూడెం గ్రామాలలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ మండల ఇన్చార్జి ఎంపీడీవో బి. విజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. ముందుగా 99 రోజుల కార్యాచరణ పనుల నివేదికను గ్రామసభలలో చదివి వినిపించారు.పచ్చదనం పారిశుధ్యంపై గ్రామాల్లో దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వస్తే పరిష్కారమవుతాయని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. పైపులైన్లకు మరమ్మతులు, నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని కార్యదర్శులకు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి గ్రామంలోని కార్యదర్శులు తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్థుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అట్టడుగు వర్గాల ప్రజలకు అందేలా ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పలువురు సర్పంచులు అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యల గురించి అధికారులకు





తెలిపారు.ఈ గ్రామ సభల్లో గ్రామాల సర్పంచులు భీమిడి ప్రదీప్ జీ, సుర్వి మల్లేష్ గౌడ్, తంగళ్ళ వెంకటేశం, అన్నాలపు నరేష్, తమ్మి రెడ్డి భారతమ్మ, గంగాపురం వసంత,ఎంపీఓ అంజిరెడ్డి, ఆర్ఐ సుధాకర్ రావు, ఏపీవో ఈశ్వరయ్య, ఆర్డబ్ల్యుఏఈ విశాల్ రెడ్డి, ఏఈ పవన్ కళ్యాణ్, ఎస్సై రవీందర్, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

## కూచిపూడి తండాలో గ్రామ సభ

కోదాడ జూన్ 08, (సాక్ష్యం)

కూచిపూడి తండా గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామసభ ఎంతో ప్రశాంతంగా, విజయవంతంగా జరిగింది. ఈ గ్రామసభకు మండల పంచాయతీ అధికారి రాంబాబు హాజరై మాట్లాడుతూ ఎల్-నీనో సంసిద్ధత, ఎస్ ఐ ఆర్ సర్వే,






వర్షాకాల సంసిద్ధత, సురక్షితమైన తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ – మన సంరక్షణ, వన మహోత్సవం తదితర అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని తెలియజేశారు. కాగా విద్యుత్ శాఖ అధికారులు హాజరుకాకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హాజీ నాయక్ , ఉప సర్పంచ్ సీత మహాలక్ష్మి కుమారస్వామి , గ్రామ కార్యదర్శి మహమ్మద్ మునవర్ పాషా , వ్యవసాయ శాఖ నుండి పిచ్చయ్య గ్రామ వార్డు సభ్యులు, గ్రామ యువకులు, పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విఓఏ సతీష్ సంఘబంధ అధ్యక్షురాలు భూరి , ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ పాల్గొన్నారు.

## సామాన్య ప్రజలపై భారం మోపుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

### ––యండి అంజద్ సామాజికవేత్త

మిర్యాలగూడ డివిజన్ జూన్ 08 (సాక్ష్యం న్యూస్)

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎండి అంజద్ మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను



నిరంతరం పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతున్నాయని యండి. అంజద్ విమర్శించారు. ఇంధన ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని ఆయన అన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించి, పెరిగిన ధరల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని యండి. అంజద్ డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతున్నాయని ఆయన అన్నారు.

# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

**ఏర్పాట్లను పరిశీలించిన సిపి సజ్జనార్**

**పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు**

**పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్**

హైదరాబాద్,జూన్8(సాక్ష్యం): చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 ఫైర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం



వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరపున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది. శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు.చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

# "టైటిల్‌కు తగ్గట్టే కథలో ఊహించని మలుపులు ఉంటాయి"

-'కొత్త మలుపు' మూవీ హీరో ఆకాష్ గోపరాజు

- ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా 2వ సినిమా
- జూన్ 12న థియేటర్‌లలో 'కొత్త మలుపు' విడుదల

ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాష్ గోపరాజు హీరోగా నటించిన రెండో చిత్రం 'కొత్త మలుపు'. దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి తెరకెక్కించిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. కోనసీమ నేపథ్యంలో రూపొందిన ఈ రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా హీరో ఆకాష్ మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు. సినిమా విశేషాలు, తన పాత్ర, సింగర్ సునీత సపోర్ట్, కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

**ప్రశ్న: మీ తొలి చిత్రం 'సర్కారు నౌకరి'తో పోలిస్తే 'కొత్త మలుపు' ఎలా భిన్నంగా ఉంటుంది?**

ఆకాష్: 'సర్కారు నౌకరి' ఒక పీరియడ్ డ్రామా అయితే, 'కొత్త



మలుపు' పూర్తిగా భిన్నమైన జానర్‌లో రూపొందింది. ఇది కోనసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగే విలేజ్ రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్. లవ్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు కథను ముందుకు నడిపే ఆసక్తికరమైన సస్పెన్స్ కూడా ఉంటుంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని నమ్ముతున్నాను. కథకు తగినట్టే ప్రముఖ దర్శకులు ఏ కోదండరామిరెడ్డి గారు సినిమాకు ఈ టైటిల్ సూచించారు.

**ప్రశ్న: సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?**

ఆకాష్: ఈ సినిమాలో నా పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. నేటి యువత ఆలోచనలు, వారి భావోద్వేగాలకు దగ్గరగా ఉండే పాత్ర ఇది. నటన పరంగా కూడా మొదటి సినిమాతో పోలిస్తే మరింత మెరుగ్గా కనిపించేందుకు ప్రయత్నించాను. బాడీ లాంగ్వేజ్, ఎక్స్‌ప్రెషన్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాను. సీనియర్‌ల సలహాలతో, మా అమ్మ సూచనలతో నా ఫర్మార్మెన్స్, యాక్టింగ్ స్కిల్స్ చాలా నేర్చుకున్నాను.

**ప్రశ్న: ఈ కథలో మిమ్మల్ని ఎక్కువగా ఆకట్టుకున్న అంశం ఏది?**

ఆకాష్: దర్శకుడు శివ వరప్రసాద్ గారు కథ చెప్పినప్పుడు అందులోని ట్విస్టులు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. నేను ఎలా అయితే సరదాగా సాగిపోయే పాత్ర ఉండాలో అచ్చం అలాంటి పాత్రతో కూడిన సబ్జెక్టును డైరెక్టర్ గారు నాకు చెప్పగానే నాకు బాగా నచ్చింది. ఇక టైటిల్‌కు తగ్గట్టే కథలో వచ్చే మలుపులు ప్రేక్షకులు ఊహించలేరు. కోనసీమ అందాలను అందంగా చూపిస్తూ, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కథను చాలా ఆసక్తికరంగా తెరకెక్కించారు.

**ప్రశ్న: మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మద్దతు లభించడం ఎంతవరకు ఉపయోగపడింది?**

ఆకాష్: మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ మా సినిమాకు చాలా పెద్ద బలం. ఇలాంటి దిగ్గజ సంస్థ మా సినిమాను విడుదల చేయడం వల్ల ప్రేక్షకుల్లో మరింత నమ్మకం పెరిగింది. కంటెంట్‌పై విశ్వాసంతోనే వారు ముందుకు వచ్చారు. దీని వల్ల సినిమా మరింత మందికి చేరుతుందని భావిస్తున్నాం.

**ప్రశ్న: హీరోయిన్ భైరవి అర్ధ్యాతో మీ కెమిస్ట్రీ గురించి చెప్పండి?**

ఆకాష్: సినిమాలో మేమిద్దరం బావ-మరదళ్లుగా కనిపిస్తాం. పల్లెటూరి నేపథ్యంలో సాగే మా పాత్రల మధ్య వచ్చే ప్రేమ, సరదా గొడవలు, ఫన్నీ సన్నివేశాలు ప్రేక్షకులను బాగా అలరిస్తాయి. మా జోడీ తెరపై చాలా ఫ్రెష్‌గా కనిపిస్తుందని దర్శకుడు కూడా చెప్పారు.

**ప్రశ్న: సినిమా చూసిన తర్వాత మీ అమ్మ సునీత గారి స్పందన ఎలా ఉంది?**

ఆకాష్: అమ్మ సినిమా చూసి చాలా సంతోషించింది. సినిమా అవుట్‌పుట్ చాలా బాగుందని, ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని చెప్పింది. నా కెరీర్ విషయంలో కథల ఎంపికలో నాకు పూర్తి స్వేచ్ఛ ఇస్తుంది. అయితే ఎప్పుడూ నా వెన్నంటే ఉండి ప్రోత్సహిస్తుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో కూడా ఆమె మాకు ఎంతో సపోర్ట్ చేస్తున్నారు.

**ప్రశ్న: సినిమా నిర్మాణ విలువలు, ప్రొడక్షన్ గురించి మీరు ఏమి చెబుతారు?**

ఆకాష్: ఈ సినిమా విషయంలో నిర్మాత తాటి బాలకృష్ణ గారు ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు. కథకు ఏది అవసరమో అది అందించాలనే దృక్పథంతో ముందుకు వెళ్లారు. కోనసీమలోని అందమైన లొకేషన్లను సహజత్వానికి దగ్గరగా, గ్రాండ్‌గా చూపించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. చిన్న సినిమాగా కాకుండా, ప్రతి ఫ్రేమ్‌లో ఒక మంచి క్వాలిటీ కనిపించేలా ప్రొడక్షన్ విలువలను మెయింటైన్ చేశారు. నటీనటులు, టెక్నీషియన్స్ అందరికీ పూర్తి సహకారం అందిస్తూ సినిమా కోసం ఎంతో ప్యాషన్‌తో పనిచేశారు. ఆయన సపోర్ట్ వల్లే మేమంతా చాలా కంఫర్ట్‌గా పని చేయగలిగాం. ప్రేక్షకులు సినిమా చూస్తే ఆ క్వాలిటీ, నిర్మాణ విలువలు ఖచ్చితంగా కనిపిస్తాయి.

**ప్రశ్న: చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల గురించి చెప్పండి?**

ఆకాష్: రఘుబాబు గారు, పృథ్వీరాజ్ గారు, ప్రభావతి గారు వంటి సీనియర్ నటులు కీలక పాత్రలు పోషించారు. వారి అనుభవం మాకు చాలా ఉపయోగపడింది. నిర్మాత తాటి బాలకృష్ణ గారు ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించారు. అలాగే సంగీత దర్శకుడు యశ్వంత్ నాగ్ అద్భుతమైన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు.

**ప్రశ్న: జూన్ 12న విడుదల కానున్న 'కొత్త మలుపు' గురించి ప్రేక్షకులకు ఏమి చెప్పాలనుకుంటున్నారు?**

ఆకాష్: 'కొత్త మలుపు' ఒక ప్యూర్ ఫ్యామిలీ, లవ్ అండ్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్. పల్లెటూరి అందాలు, ప్రేమ, నవ్వులు, ఎమోషన్స్, సస్పెన్స్ అన్నీ కలగలిపిన చిత్రం. మేమంతా ఎంతో ఇష్టపడి, కష్టపడి చేసిన ఈ సినిమాను జూన్ 12న థియేటర్లలో విడుదల చేస్తున్నాం. ప్రేక్షకులు థియేటర్లకు వచ్చి సినిమా చూసి మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను.

తొలి చిత్రం 'సర్కారు నౌకరి'తో హీరోగా పరిచయమైన ఆకాష్ గోపరాజు, ఇప్పుడు 'కొత్త మలుపు'తో మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల వస్తున్న నేపథ్యంలో ఈ సినిమాపై తెలుగు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. కోనసీమ నేపథ్యం, రొమాన్స్, సస్పెన్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ కలగలిసిన ఈ చిత్రం జూన్ 12న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాపై చిత్రబృందం పూర్తి నమ్మకంతో ఉంది.

# శ్రీకాంత్ చేతుల మీదుగా 'ఒక కోర్టు కేస్' మూవీ టీజర్ లాంచ్

- చిత్ర యూనిట్‌పై ప్రశంసలు కురిపించిన శ్రీకాంత్
- జూలై 17న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్
- ఆసక్తిరేపే, ఆశ్చర్యపరిచే కథాంశంతో తెరకెక్కిన చిత్రం

ప్రేమ, విరహం, మోసం వంటి అంశాల చుట్టూ ఇప్పటికే టాలీవుడ్‌లో ఎన్నో సినిమాలు వచ్చినప్పటికీ, ప్రేమలో మోసపోయిన ఓ యువకుడు తనకు జరిగిన అన్యాయానికి న్యాయం కోరుతూ కోర్టును ఆశ్రయించడం అనే వినూత్న కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం 'ఒక కోర్టు కేస్'. ఓపెన్ ఐస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగేష్ పూడి, ముకేష్ పూడి సమర్పణలో, అండమాన్‌కు చెందిన యువ దర్శకుడు గణేష్ పూడి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ స్వయంగా దర్శకత్వం వహించి నిర్మించిన ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ హీరో శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. "టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రస్తుతం యువతకు దగ్గరగా ఉండే అంశాన్ని దర్శకుడు కొత్త కోణంలో చూపించే ప్రయత్నం చేశారు. ప్రేమలో జరిగే సంఘటనలను లీగల్ డ్రామాగా మలచడం ఆసక్తికరంగా అనిపించింది. టీజర్‌లో ప్రతి షాట్ ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచేలా ఉంది. గణేష్ పూడి, చిత్ర యూనిట్‌కు నా అభినందనలు. సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. దర్శకుడు, నిర్మాత గణేష్ పూడి మాట్లాడుతూ.. "మా సినిమా టీజర్‌ను శ్రీకాంత్ గారు విడుదల చేసి, చిత్ర బృందాన్ని అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. 'ప్రతి ప్రేమికుడికి తన ప్రేమ కోసం పోరాడే హక్కు ఉంది' అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన టీజర్‌కు ఇప్పటికే అద్భుతమైన స్పందన లభిస్తోంది.

ప్రేమలో మోసపోయిన వ్యక్తి న్యాయం కోసం చేసే పోరాటాన్ని వినోదాత్మకంగా, భావోద్వేగాలతో కూడిన లీగల్ డ్రామాగా తెరకెక్కించాం. ఈ సినిమా ప్రధానంగా బ్రేకప్ తర్వాత జరిగే ప్రతీకారం (Post Breakup Retaliation) అనే అంశాన్ని కూడా చూపిస్తుంది. ప్రేక్షకులకు ఇది కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకం ఉంది" అని తెలిపారు. హీరో సూర్యాన్ష్ మాట్లాడుతూ.. "'ఒక కోర్టు కేస్' నా




కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమా. ప్రేమలో మోసపోయిన ఓ యువకుడు తన ప్రేమ కోసం, తనకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా న్యాయం కోసం చేసే పోరాటం ఈ చిత్రంలో ప్రధానాంశం. దర్శకుడు గణేష్ పూడి గారు కథను చాలా కొత్తగా తీర్చిదిద్దారు.

టీజర్‌కు వస్తున్న స్పందన మాకు ఎంతో ఉత్సాహాన్నిస్తోంది. జూలై 17న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మా సినిమాను అందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. హీరోయిన్ తనిషా మిశ్రా మాట్లాడుతూ.. "ఈ సినిమాలో నాకు చాలా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది. ప్రేమ, భావోద్వేగాలు, సంఘర్షణలతో కూడిన నా పాత్ర ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది. కథ విన్నప్పుడే ఇది సాధారణ ప్రేమకథ కాదని అర్థమైంది. దర్శకుడు గణేష్ పూడి గారు ప్రతి పాత్రను ఎంతో బలంగా మలిచారు. టీజర్‌కు లభిస్తున్న ఆదరణ ఎంతో ఆనందంగా ఉంది. ప్రేక్షకులు సినిమాను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని తెలిపారు. ఈ చిత్రంలో హీరో సూర్యాన్ష్, హీరోయిన్ తనిషా మిశ్రాతో పాటు సీనియర్ నటులు థర్టీ ఇయర్స్ పృథ్వి, సత్యకృష్ణ, దయానంద్, ముక్తార్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ప్రేమలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించే ఈ వినూత్న లీగల్ లవ్ డ్రామా 2026 జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# త్రిగుణ్ పుట్టిన రోజు సందర్భంగా 'జంగా' నుంచి మోషన్ పోస్టర్ విడుదల

శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్‌కె ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ మీద రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి నిర్మిస్తున్న చిత్రం 'జంగా'. త్రిగుణ్, నేహా పఠాన్, వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రావణ్, మధునందన్ , గగన్ విహారి, చందు గౌడ,సమీర్, నాగ మహేష్,భూపాల్, రఘు కారుమంచి, రచ్చ రవి, ప్రధాన పాత్రల్లో రాబోతోన్న ఈ మూవీకి కెవిన్ గడ్డం(శ్రీహరి) కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిగుణ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్రయూనిట్ స్పెషల్ అప్డేట్‌ను ఇచ్చారు. త్రిగుణ్ బర్త్ డే స్పెషల్‌గా 'జంగా' నుంచి పోస్టర్ & మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులోని విజువల్స్, సౌండింగ్, హీరో లుక్ చాలా కొత్తగా ఉన్నాయి. ఇంత వరకు లవర్ బాయ్‌లా కనిపించిన త్రిగుణ్ ఈ సారి రా అండ్ రస్టిక్ లుక్‌లో మాసీగా కనిపిస్తున్నారు. కెరీర్‌లోనే డిఫరెంట్ సబ్జెక్ట్, పాత్రని పోషిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ చివరి దశలో ఉంది. మున్ముందు మరిన్ని అప్డేట్‌లతో ఆడియెన్స్‌ని ఆకట్టుకోనున్నారు. ఈ సినిమాకి కృష్ణ సౌరభ్ సంగీతాన్ని అందిస్తుండగా.. వెంకట్ సి. దిలీప్ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు రాయగా.. కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటల్ని రాస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు.





# విజయ్ ఆంటోని 'వంద దేవుళ్ళు' ట్రైలర్‌ను రిలీజ్ చేసిన మెగా ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల

విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి నిర్మించిన చిత్రం 'వంద దేవుళ్ళు'. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయబోతోన్నారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాస్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, పోస్టర్లు ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేశాయి. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మెగా ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. 'ఈ లోకంలో ప్రాణాలతో పుట్టిన అందరికీ కనీస అవసరాలుంటాయి.. తినడం, నిద్రపోవడం, తోడు వెతుక్కోవడం' అనే డైలాగ్‌తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆ తరువాత వచ్చిన హీరో, హీరోయిన్ల ప్రేమ సన్నివేశాలు ఎంతో రిఫ్రెషింగ్‌గా అనిపించాయి. ఇక ఈ కథలో భార్యాభర్తల బంధం, తల్లీకొడుకుల అనుబంధాన్ని గొప్పగా చూపించినట్టు కనిపిస్తోంది. అన్ని రకాల ఎలిమెంట్స్‌ను జోడించిన ఈ కథను అద్భుతంగా మలిచినట్టు అనిపిస్తోంది. యాక్షన్స్, విజువల్స్, బీజీఎం ఇలా అన్నీ కూడా ట్రైలర్‌లో హైలెట్ అవుతున్నాయి. నిహారిక కొణిదెల గారు ట్రైలర్ పై, "వంద దేవుళ్ళు' ట్రైలర్ రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. స్వాసిక గారు అద్భుతంగా కనిపిస్తున్నారు. పాత్రకు న్యాయం చేసినట్టుగా అనిపిస్తోంది. ఇలాంటి ఓ హృద్యమైన కథతో వస్తోన్న శశి గారికి ఆల్ ది బెస్ట్. విజయ్ ఆంటోనీ గారిని చూస్తుంటే ఈ సారి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టేలా కనిపిస్తున్నారు. ఎమోషన్స్, రిలేషన్ షిప్స్‌ను కలిపి గొప్ప కథను అందించబోతోన్నారని స్పష్టంగా అర్థం అవుతోంది. టీం మొత్తానికి ఆల్ ది బెస్ట్' అని పోస్ట్ చేశారు. ఈ సినిమాకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఇక ఈ మూవీని జూన్ 19న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు.

# ఘనంగా 'ఐ యామ్ హ్యాండ్సమ్' ట్రైలర్ లాంచ్ & ప్రీ-రిలీజ్ ఈవెంట్

హైదరాబాద్: తండ్రి-కొడుకుల అనుబంధం, త్యాగం, ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందిన హృదయాన్ని హత్తుకునే చిత్రం 'ఐ యామ్ హ్యాండ్సమ్' (Since 2009). దుర్గా దేవ్ నాయుడు హీరోగా నటిస్తూ స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన ఈ చిత్రాన్ని K ఫిలిమ్స్ బ్యానర్ పై, మహేష్ గుడారు సమర్పణలో కేదార్‌నాథ్ నిర్మించారు. అన్విష కథానాయికగా నటించిన ఈ చిత్రం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో చిత్ర ట్రైలర్ లాంచ్, ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందాన్ని అభినందించారు. ముఖ్య అతిథి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, "సినిమా విజయానికి అసలు బలం కంటెంట్. మంచి కథ, బలమైన భావోద్వేగాలు ఉన్న సినిమాలు ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోతాయి. దుర్గా దేవ్ నాయుడు నటుడిగా, దర్శకుడిగా ఒకేసారి బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అభినందనీయం. ఆయనలో ఉన్న ప్రతిభ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తుంది. సినీ పరిశ్రమలో టాలెంట్‌కు ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. దర్శకుడు, హీరో దుర్గా దేవ్ నాయుడు మాట్లాడుతూ, "నేను ఏలూరుకు చెందినవాడిని. మా నాన్న అరటిపండ్ల వ్యాపారి. చిన్న పట్టణం నుంచి వచ్చి ఈ రోజు ఇక్కడ నిలబడటం నాకు ఎంతో ఆనందంగా ఉంది. అందుకే



నేను నాకు నేనే స్టార్ అని గర్వంగా చెప్పుకుంటాను. ప్రేక్షకులందరికీ నచ్చే సినిమా తీశాను. ఒకవేళ నచ్చకపోతే ఇంకా మంచి సినిమా తీస్తాను అని నిజాయితీగా చెబుతున్నాను. ఈ సినిమాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. చిత్ర యూనిట్‌లోని ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి పనిచేశారు. డబ్బుల గురించి ఆలోచించకుండా సినిమా కోసం కష్టపడ్డారు. నిర్మాత కేదార్‌నాథ్ గారు, కేఎల్ దామోదర్ ప్రసాద్ గారు ఎంతో సహకారం అందించారు. తెలుగు ప్రేక్షకులతో పాటు మంచి కంటెంట్ కోసం ఎదురుచూసే ప్రతి సినీ ప్రేమికుడికి ఈ సినిమా తప్పకుండా నచ్చుతుంది" అన్నారు. నిర్మాత కేదార్‌నాథ్ మాట్లాడుతూ, "మంచి కథను నమ్మి ఈ సినిమాను నిర్మించాం. తండ్రి-కొడుకుల మధ్య ఉన్న బంధాన్ని హృదయానికి హత్తుకునేలా దర్శకుడు దుర్గా దేవ్ నాయుడు తెరకెక్కించారు. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ భావోద్వేగానికి లోనవుతారు. మా యూనిట్ అంతా ఎంతో అంకితభావంతో పనిచేసింది. జూన్ 12న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను" అన్నారు. సంగీత దర్శకుడు ఎన్.ఎస్. ప్రసూ మాట్లాడుతూ, "ఈ చిత్రానికి సంగీతం అందించడం సంతోషంగా ఉంది. కథలోని భావోద్వేగాలకు తగ్గట్టుగా సంగీతాన్ని అందించాం. పాటలు, నేపథ్య సంగీతం ప్రేక్షకులకు బాగా నచ్చుతాయని నమ్ముతున్నాను. ఈ సినిమా ద్వారా మా అందరికీ మంచి పేరు రావాలని కోరుకుంటున్నాను" అన్నారు. హీరోయిన్ అన్విష మాట్లాడుతూ, "మా సినిమాను సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. కథ వినగానే చాలా బాగా నచ్చింది. ఇందులో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి. సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం అప్పుడే కలిగింది. ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడు, నిర్మాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విడుదల చేసిన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. పల్లెటూరి నేపథ్యం, కుటుంబ భావోద్వేగాలు, తండ్రి-కొడుకుల మధ్య సాగే అనుబంధం, జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, హృదయాన్ని తాకే సన్నివేశాలతో ట్రైలర్ ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా హీరో దుర్గా దేవ్ నాయుడు పాత్ర, భావోద్వేగ సన్నివేశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ట్రైలర్ విడుదల అనంతరం చిత్ర బృందం మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించింది. విలేకరులు అడిగిన ప్రశ్నలకు దర్శకుడు దుర్గా దేవ్ నాయుడు, నిర్మాత కేదార్‌నాథ్, సాంకేతిక నిపుణులు సమాధానాలు ఇచ్చారు. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని, ముఖ్యంగా చివరి 45 నిమిషాలు ప్రతి ప్రేక్షకుడిని భావోద్వేగానికి గురి చేస్తాయని, థియేటర్ల నుంచి తృప్తిగా బయటకు వస్తారని వారు తెలిపారు. 'ఐ యామ్ హ్యాండ్సమ్' కుటుంబ బంధాలు, త్యాగం, ప్రేమ, భావోద్వేగాల సమ్మేళనంగా ప్రేక్షకులను అలరించేందుకు జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380